వేదాంతభేరి

అక్టోబరు 2019

రూ. 10/-

Scanned by CamScanner



అక్టోబరు 2వ తేదీ మహాత్మాగాంధీ జయంతి.

అక్టోబరు 13వ తేదీ రామాయణకావ్య రచయిత వాల్మీకి జయంతి

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 52 అక్టోబర్ 2019 సంచిక : 10

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578-222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

Scanned by CamScanner

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 52 అక్టోబర్ 2019 సంచిక : 10

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. సుదీర్ఘ ప్రయాణము - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు -06
03. ఇంద్రియ నిగ్రహము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -11
04. ఇదే మన లక్ష్యం - శ్రీ స్వామి చిన్మయానంద -15
05. ధర్మ సూక్ష్మాలు - డా॥ సముద్రాల లక్ష్మణయ్య -17
06. ఉద్ధవ గీత - శ్రీ యేలేశ్వరపు హనుమరామకృష్ణ - 22
07. సన్న్యాసము యొక్క అంతరార్థము
- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 26
08. సన్న్యాసము - మహామండలేశ్వర్ శ్రీ విద్యానందగిరి మహరాజ్ - 27
09. సన్న్యాసాశ్రమం ఎంతో ఖ్యాతి గల అతి ప్రాచీన వ్యవస్థ
శ్రీ రంగనాథానంద స్వామీజీ మహరాజ్ - 30
10. ఆంధ్ర మహా భాగవతము - డా॥ ఆచార్య జక్కంపూడి మునిరత్నం -33
11. శృంగార రాయుని బ్రహ్మోత్సవ హేల - డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్- 37
12. పరివ్రాజక పరమార్థము - నైనారు అప్పాస్వామి - 41
13. వార్తలు - 42

ముఖచిత్రం - కొల్హాపూర్ మహాలక్ష్మి

5వ తేది సరస్వతిపూజ, 6వ తేది దుర్గాపూజ,
7వ తేది మహర్నవమి మహాలక్ష్మి పూజ
పాఠకులకు, భక్తులకు విజయ దశమి శుభాకాంక్షలు

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

శ్రీ లక్ష్మీ స్తోత్రమ్

01. ఓం వన్దే పద్మకరాం ప్రసన్న వదనాం సౌభాగ్యదాం భాగ్యదాం,
హస్తాభ్యామభయప్రదాం మణిగణైః నానావిధైః భూషితామ్।
భక్తాభీష్ట ఫలప్రదాం హరిహర బ్రహ్మాదిభిస్సేవితామ్ ।
పార్శ్వే పంకజ శంఖపద్మనిధిభిః యుక్తాం సదా శక్తిభిః ॥

02. సరసిజనయనే! సరోజహస్తే! ధవళతరాంశుకగన్ధమాల్య శోభే!
భగవతి హరివల్లభే మనోజ్ఞే త్రిభువనభూతికరి ప్రసీద మహ్యమ్॥

03. ప్రకృతిం వికృతిం విద్యాం సర్వభూతహితప్రదామ్।
శ్రద్ధాం విభూతిం సురభిం నమామి పరమాత్మికామ్ ॥

04 అదితిం చ దితిం దీప్తాం వసుధాం వసుధారిణీమ్ ।
నమామి కమలాం కాన్తాం క్షమాం క్షీరోదసంభవామ్॥

05. నమామి ధర్మనిలయాం కరుణాం లోకమాతరమ్ ।
పద్మప్రియాం పద్మహస్తాం పద్మాక్షీం పద్మసుందరీమ్॥

06. పద్మోద్భవాం పద్మముఖీం పద్మనాభప్రియాం రమామ్।
పద్మమాలాధరాం దేవీం పద్మినీం పద్మగన్ధినీమ్ ॥

07. పుణ్యగన్ధాం సుప్రసన్నాం ప్రసాదాభిముఖీం ప్రభామ్ ।
నమామి చంద్రవదనాం చంద్రాం చంద్రసహోదరీమ్॥

08. శుభాం హిరణ్య ప్రాకారాం సముద్రతనయాం జయామ్।
నమామి మంగలాం దేవీం విష్ణువక్షఃస్థలస్థితామ్ ॥

09. లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీమ్।
దాసీభూత సమస్త దేవవనితాం లోకైక దీపాంకురామ్।
శ్రీమన్మన్దకటాక్ష లబ్ధవిభవబ్రహ్మేన్ద్ర గంగాధరామ్।
త్వాం త్రైలోక్యకుటుమ్బినీం సరసిజాం వన్దే ముకున్దప్రియామ్ ॥

10. మాతర్నమామి కమలే ! కమలాయతాక్షి
శ్రీవిష్ణుహృత్కమలవాసిని విశ్వమాతః ।
క్షీరోదజే కమల కోమలగర్భగౌరి ।
లక్ష్మీ! ప్రసీద సతతం నమతాం శరణ్యే ॥

సుదీర్ఘ ప్రయాణము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఒక పెద్ద ప్రయాణము ప్రతివానికిన్ని వేచియున్నది. జీవిత కాలములో రైళ్ళమీద, బస్సులమీద, విమానముల మీద చేయు ప్రయాణములు చిన్నవి. జీవితాంతమున చేయు ప్రయాణము పెద్దది. ఆ ప్రయాణమును ఎవరునూ తప్పించుకొనలేరు. అది జరిగి తీరును. అజ్ఞానవశమున జీవుడు దానిని మఱచి లోకమున ప్రవర్తించుచున్నాడు. అన్నియు జ్ఞాపకముంచుకొనునుగాని తనకొక దీర్ఘ ప్రయాణము కాచుకొని యున్నదని మాత్రము మఱచును. కనుకనే ప్రమాదమున పడిపోవుచున్నాడు.

' Think of Death always and you will realise the truth of every word I say' (Swami Vivekananda).

'మరణమును సదా జ్ఞాపకమునందుంచుకొనినచో నేను చెప్పు వాక్యములన్నియు చక్కగ బోధపడగలవు' అని వివేకానందులు తన శిష్యులతో నొకపుడు పలికియున్నాడు. గూడ్సు పెట్టెలపై 'Return' (త్రిప్పి పంపవలెను) అని వ్రాసి దాని ప్రక్కన ఒక తేది వేయుదురు. అనగా ఆ తేదినాటికి ఆ పెట్టె అరిగిపోవును గాన దానిని గూడ్సు షెడ్డుకు 'రిపేరు'కు గాను త్రిప్పి పంపవలెనని అర్థము. ఆ త్రిప్పిపంపు తేదిని గూడ్సు పెట్టె తయారైనదినమే నిర్ణయించి దానిపై వేయుదురు. అట్లే బ్రహ్మదేవుడు ఈ దేహపంజరమును సృష్టి చేసి ప్రపంచమున వదలిన దినమే దాని నొసటపై 'త్రిప్పి పంపవలసిన దినమును' కూడ వ్రాసియుంచును. అయితే భేదమేమియనిన, గూడ్సు పెట్టెలపై తేది కనిపించును. జీవుని నొసట కనిపించదు. దానినే బ్రహ్మవ్రాత, విధిలిఖితము అందురు. కనిపించనంతమాత్రమున అది లేకపోలేదు. పుట్టినది గిట్టకమానదు. 'జాతస్య హి ధ్రువో మృత్యుః' మహనీయు లందఱున్ను తమ జీవిత కాలములోనే ఈ మహాప్రయాణమును గుఱించి యోచించుదురు. వార్ధక్యము రాకపూర్వమే అనగా బాల్యయౌవనములందే

దానినిగూర్చి చింతించి తన్నివారణకు తగిన మందు కనిపెట్టుదురు. నచికేతుడు హఠముపట్టి యమధర్మరాజునుండి ఆ రహస్యమును ఊడబెఱికికొనెను. 'ఓ నచికేతా! నీకు ముల్లోకములందలి భోగములు, ఐశ్వర్యములు, సంపదలు అన్నిటిని ఇచ్చెదను. "మరణం మానుప్రాక్షీః" – మరణానంతర విషయమును మాత్రము అడుగవద్దు అని యముడెంత చెప్పినను వినక జన్మరాహిత్యమునకు ఔషధమగు ఆత్మవిజ్ఞానమునే కోరుకొనెను. అర్జునుడు కూడ ఈ కోవకు చెందినవాడే. కనుకనే శ్రీకృష్ణపరమాత్మను.

'ప్రయాణకాలే చ కథం జ్ఞేయో உసి నియతాత్మభిః ' (8-2)

'అంత్యకాలమునందును నిన్నెట్లు తెలిసికొనగలరో వచింపుము' అని యడుగుటకు కారణము. ఈ ప్రకారము తమ జీవితకాలముననే మరణము సంగతి జ్ఞాపకముంచుకొని, మరల ఎన్నటికిని జన్మింపక, మరణింపకయుండు స్థితిని పొందుటకై యత్నించువారు ధన్యులు. అట్టివారే మానవత్వమును సార్థకపరచుకొనినవారు.

'జాతా స్త ఏవ జగతి జన్తవస్సాధుజీవితాః
యే పునర్నేహ జాయన్తే శేషా జరఠగర్దభాః. **(వసిష్ఠగీత)**

'ఓ రామచంద్రా! మఱల పుట్టకుండ చేసికొనగలుగు మహాత్ము లెవరు కలరో, అట్టి ఉత్తమశీలసంపన్నులు మాత్రమే ఈ ప్రపంచమున పుట్టినవారి క్రింద జమ. తక్కిన వారు వ్యర్థజీవితులే యగుదురు అని వసిష్ఠులు శ్రీరామచంద్రునకు బోధించెను.

కాని ఇక్కాలమున జనులు కాయము శాశ్వతమని యెంచి, ప్రయాణము మాట పూర్తిగ మఱచిపోయి, అనేక సాంసారిక వ్యామోహములందు మునిగి, కాలము గడచిపోవుచుండ దేబరించి చూచుచు, పారలౌకిక ప్రయత్న విరహితులై మెలగుచున్నారు. ప్రజల ఈ అవివేకమును భర్తృహరి యెంత చక్కగ వర్ణించెనో చూడుడు.

ఆదిత్యస్యగతాగతై రహరహస్సంక్షీయతే జీవితమ్

Scanned by CamScanner

వ్యాపారైర్బహుకార్యభారగురుభిః కాలో న విజ్ఞాయతే
దృష్ట్వా జన్మజరావిపత్తి మరణం త్రాసశ్చ నోత్పద్యతే
పీత్వా మోహమయీం ప్రమాదమదిరామున్మత్తభూతం జగత్. (భర్తృహరి)

"సూర్యుని ఉదయాస్తమానములచే రోజురోజుకు జీవితము తఱిగిపోవుచున్నది. కాని ఎడతెగని పనులలో మునిగితేలుచు జనులా విషయమును గుర్తెఱుగకున్నారు. పుట్టుచున్న వారిని, మరణించుచున్నవారిని, ముసలివారిని, బాధల నొందుచున్న వారిని చూచికూడ భయపడకయున్నారు. అజ్ఞానమను కల్లుత్రాగి జగమెల్ల మతిదప్పియున్నది!" నిజముగ లోక పరిస్థితి ఇట్లే యున్నది. భగవద్ధ్యానము చేసికొనుటకు తీరికయే లేదని వారు చెప్పుదురు. ఉదయము నిద్రలేచినది మొదలు మరల పరుండువఱకును ఒక్క పర్యాయమైనను దైవస్మరణకు తావీయక నశ్వర ప్రాపంచిక వస్తుసంపాదనమునందే వారు నిమగ్నులై యుందురు. ఈ మధ్య ఒకాయన వ్యాపారములలో మునిగితేలుచు ఎవరో ప్రశ్నించుసరికి **'I have no time even to die** నాకు చావటానికి కూడ తీరికలేదు'– అని చెప్పివేసెను. అట్లుండును ఆధునిక మానవుని మనః స్థితి. ఇక దైవచింతనకు వారి జీవితములో చోటెచట? కాబట్టియే అట్టివారు మానవులవలె మరణించక, క్రిమికీటకాదులవలె మరణించుచున్నారు. వారి జన్మము నిరర్థకమై పోవుచున్నది.

కాబట్టి విజ్ఞుడగువాడు తన జీవిత కాలముననే అంత్యకాల ప్రయాణమును గుఱించి యోచించి ఆధ్యాత్మిక సాధనల ద్వారా భవరోగమను దుఃఖమును బాపుకొనవలెను. అర్జునున కట్టి యోచనయే కలిగినది.. కనుక తత్క్షణమే శ్రీకృష్ణ పరమాత్మకు తన సంకల్పమును వెలిబుచ్చి శరీరవియోగ సమయమునగూడ జీవుడెట్టి భావనతో గూడి యుండవలెనో, ప్రశ్నించెను. అందులకు శ్రీకృష్ణమూర్తి విపులమగు సమాధానమొసంగి అక్షర పరబ్రహ్మతత్త్వమును, ప్రణవధ్యానమును బోధించెను. "అంత్యకాలమున గూడ ఎవరు నన్నే స్మరించుచు దేహమును వీడుదురో అట్టివారు పరమగతియగు నన్నే పొందుదురు. ఈ విషయము

ముమ్మాటికిని సత్యము" అని భగవానుడు పలికెను. అదేవిధముగ అంత్యకాలమున ఇతరమగు ఏ రూపమును స్మరించినను, సంస్కారబలము వలన ఆ రూపమునే మఱుజన్మయందు జీవుడు పొందుచుండును. తుచ్ఛ విషయమును చింతించినచో తుచ్ఛరూపమునే పడయును. మరణకాలమున లేడిని భావించినందున జడభరతుడు లేడిజన్మ నెత్తవలసి వచ్చెను గదా! చిత్తము అద్దమువంటిది. దాని యెదురుగ ఏ రూపమునుంచిన ఆ రూపమే అందు ప్రతిబింబించును, కాబట్టి మఱుజన్మకు హేతుభూతమైనట్టి అంత్యకాల సంస్కారము బహు పవిత్రముగ నుండవలెను. దీనికి ఉపాయమేమి? అంత్యకాలమున అకస్మాత్తుగ మంచి గుణము మనుజులపై ఊడిపడదు. జీవిత కాలమంతయు ఎంతయో కృషిచేసి పవిత్ర గుణములను సంపాదించిన వారికి మాత్రమే చిత్తము సత్త్వగుణమయమై అంత్యకాలమున భగవత్స్మరణ సంభవింపగలదు.

విద్యార్థి సంవత్సరకాలమంతయు బాగుగ చదివిననే పరీక్షా సమయమున చక్కగ వ్రాయగలడు. సంవత్సరము పొడుగునా సోమరియై తిరుగుచు సరిగా పరీక్షా సమయమున మాత్రము పుస్తకము తెఱచినచో ఏమి బోధపడును? ఏమి వ్రాయగలడు? ఎట్లు కృతార్థుడు కాగల్గును? తన చిత్తమును తానే బాగుచేసికొనవలయును. అదియో ఒక్కరోజుతో అగు పనికాదు. అనేక జన్మార్జిత ఘనీభూత పాపవాసనలుగల చిత్తము సద్వాసనామయము కావలసియున్నచో, భగవదున్ముఖమై చక్కగ ధ్యానముచేయు సమర్థతను బొందవలసి యున్నచో జీవిత కాలమంతయు తీవ్రతర ప్రయత్న మావశ్యకమై యున్నది. రైలుయాత్ర చేయదలంచువాడు ప్రయాణ కాలమునకు ఎన్ని గంటలనుండియో మూట, ముల్లె సర్దుకొని సిద్ధపడుచుండుట మనము చూచుటలేదా? అట్లే దీర్ఘ ప్రయాణమగు మరణమునకై బాల్య కాలమునుండియే తగు సంస్కారము నేర్పఱచు కొనవలెను. అంత్యకాలమున అప్పటికప్పుడు ధ్యానము సిద్ధించవలెననిన అది సాధ్యపడు విషయము కాదు. అంత్యకాలమున భగవద్ధ్యానము చేసినచో మోక్షము కలుగనని శ్రీకృష్ణమూర్తి చెప్పెను గదా! యని కొందఱు సోమరులు అపోహపడి 'ఇక పరవాలేదు. జీవితమంతయు పాపము చేసినప్పటికి

అంత్యకాలమున దేవునకు ఒక నమస్కారం పెట్టితే కైవల్యప్రాప్తి కలుగగలద'ని భావించు చున్నారు. వారి వాదనను బలపఱచుకొనుటకు అజామిళుని దృష్టాంతము గైకొందురు. ఇటువంటి అలసుల విషయమై బాగుగ ఆలోచించియే అర్జునుడు, శ్రీకృష్ణుడు ఇరువురు బహు జాగ్రత్తగ మాట్లాడిరి. సోమరులకు అవకాశమే ఇవ్వలేదు. అర్జునుడు 'ప్రయాణకాలేచ కథం జ్ఞేయోఽసి' (మరణకాలమున కూడ నిన్నెట్లు తెలుసుకొనగలరు?) అని ప్రశ్నింప శ్రీకృష్ణుడు 'అన్తకాలేచ మామేవ స్మరన్' (అంత్యకాలమున కూడ నన్నే స్మరించు వారు ముక్తిని బొందగలరు) అని జవాబిచ్చెను. ఇరువురి వాక్యములలోను 'చ' కారముండుట గమనింపదగినది. 'చ'అనగా సంస్కృతములో 'కూడ' అని అర్థము. అంత్యకాలములో కూడా నన్ను ధ్యానించువారు' అని చెప్పిరి కాని 'అంత్యకాలములోనే' అని చెప్పలేదు. 'అంత్యకాల ఏవ' అని శ్రీకృష్ణుడు చెప్పి యుండినచో కొంప మునిగి యుండెడిది. సోమరులు శ్రీకృష్ణునికి బ్రహ్మరథము పట్టియుండెడివారు. కాని భగవానుడు వారి ఆటలను సాగనివ్వలేదు. 'చ' కార బాణప్రయోగముచే సోమరుల గుండెలను భేదించివేసెను. ఇంతియేకాదు ఆ 'చ' కారమును సరిగా వారు అర్థము చేసికొందురో, లేదో యని భావించి వెంటనే ఈ క్రింది శ్లోకము ద్వారా అద్దానికి భాష్యమును గూడ చెప్పివైచెను.

తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ
మయ్యర్పితమనోబుద్ధి ర్మామేవైష్యస్యసంశయః.

'కాబట్టి ఓ అర్జునా! ఎల్ల వేళలయందును నన్ను స్మరింపుము. నీ స్వధర్మమగు యుద్ధముగూడ జేయుము. నాయందు అర్పింపబడిన మనస్సు బుద్ధికలవాడవైనచో నీవు నన్ను తప్పక పొందగలవు. ఇట సంశయ మేమియును లేదు'అని భగవానుడు 'అంత్యకాలములో కూడ' అను పదమునకు వివరణము చెప్పెను. ఎల్లకాలములందనగా, బాల్య యౌవన వార్ధక్యములందని భావము. అనగా సర్వకాలములందని అర్థము. కావున విజ్ఞుడగువాడు తనకు రాగల దీర్ఘ ప్రయాణమును గుఱించి యోచించి, దైవధ్యానాదుల ద్వారా అద్దానినిపుడే నివారించుకొని జన్మరాహిత్య కైవల్య పదవిని అలంకరించవలెను.

భావశుద్ధియే జ్ఞాన సిద్ధి

ఇంద్రియ నిగ్రహము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

(గత సంచిక తరువాయి)

ఇంద్రియములు నశించుటయే మోక్షమని నమ్మిన పక్షమున చూడాల ఏలాగున తన భర్తయగు శిఖధ్వజమహారాజునకు జ్ఞాన మార్గ మాదేశించుటకు సాధ్యమగును?

ఇంద్రియ విలయమే మోక్షమనియు, బ్రహ్మసాక్షాత్కారమనియు, జ్ఞానమనియు చెప్పినచో శ్రీ ఆదిశంకర భగవత్పాదులు ఏలాగున దిగ్విజయము చేయగల్గిరి? సూత్ర భాష్యాది గ్రంథముల నుద్ధరింపగల్గిరి. అదే రీతిగా ఇంద్రియములు నీటిలో కలిపిన ఉప్పు రీతి భగవంతునిలో లీనమై పోవుటయే ముక్తియని చెప్పినచో శ్రీరామానుజాచార్య, శ్రీకృష్ణ చైతన్యాదు లెట్లు భక్తితత్త్వమును లోకమునకు బోధింపగల్గిరి? శాస్త్రములు వ్రాయగల్గిరి. అదేరీతిగా జలములో గలిసిన ఐస్‌గడ్డవలె ఆత్మ పరమాత్మలో ఐక్యమొందుటే నిర్వాణమగు ముక్తి అయినచో శ్రీబుద్ధదేవుడేలాగున తనయొక్క పరమ పావనమగు బౌద్ధధర్మమును లోకములో ఉపదేశింప గల్గెను? నీటిలో కలిసిన చక్కెర రీతిగా బ్రహ్మమయమై యుండుటే ముక్తియని చెప్పినచో శ్రీగురునానక్ ఏలాగు తనయొక్క పావనమతమును బోధింపగల్గెను. ఈలాగున ఇతర మతస్థులయొక్కయు, మహర్షుల యొక్కయు, యోగుల యొక్కయు, పరమభక్తుల యొక్కయు స్థితి గ్రహించుకొనవచ్చును.

వీరి అందరియొక్క మత ప్రకారము ఇంద్రియములు శుద్ధములై స్వాధీనములై యుండుటే ఇంద్రియ నిగ్రహమని అర్థమగునుగాని, మరి యొకటి కానేరదు. ఈ తత్త్వమును తెలిసికొనక, యోగమార్గము చక్కగ నెరుంగక, అధిక నిరాహారము చేతను, శరీర పీడాపరమగు తపస్సుచేతను, ఇంద్రియములను క్షీణింపజేసికొని, ఆఖరున ఆ ఇంద్రియములను దైవ కార్యములను గూడ చేయుటకు శక్తి లేని స్థితిలోనికి తీసికొని

Scanned by CamScanner

వచ్చుచున్నారు. దీనివల్ల యోగాభ్యాసము గాని, ప్రాణాయామము గాని, వ్రతములుగాని, తపస్సులు గాని అవసరము లేదని తలంపరాదు. ఇవి యన్నియు ఇంద్రియ శుద్ధి, దేహశుద్ధి, మనశ్శుద్ధి కల్గుటకు కారణములని భావింపవలెనే కాని, ఇంద్రియములు మరచి యుండవలెనని గాని, వాని ధర్మ బద్ధములగు వృత్తులుండరాదని గాని తలంపరాదు.

పాషాణాది వస్తువులు పుటము వేయవలె నన్నప్పుడు వానిలో గల విషము నశింపజేయవలెనని యర్థమే గాని, వస్తువును కూడ నశింప జేయవలెనను నర్థము గాదుగదా! ఆలాగున మలిన బంగారమును పుటమువేయుట యని జెప్పునప్పుడు దానియందు యున్న యశుద్ధ లోహము పోగొట్టవలెనని గాని, బంగారు లేకుండునట్లు జేయుట యని యర్థము గాదు గదా! ఆలాగున ఏ వస్తువునైనను శుద్ధి చేయవలెనని చెప్పునప్పుడు దానిలో గల దోషములు లేకుండ చేయవలయునని యర్థమేగాని, ఆ వస్తువును నశింపజేయవలయునని అర్థము గాదుగదా! అట్టి యర్థమే ఇచ్చటగూడ గ్రహించవలెను. ఇంద్రియములకు శుద్ధావస్థ కల్గునప్పుడు అంతరింద్రియములును, జ్ఞానేంద్రియములును, కర్మేంద్రియములును పరిశుద్ధములై నిర్విషయత్వము కల్గియుండును.

ఇక చెప్పవలసిన విషయములు విశుద్ధ తత్త్వమును గురించినదగును. ఇచ్చటికి వచ్చినప్పుడు మనస్సు వ్యవహార తత్వము నుండియు, వ్యావహారిక ధర్మము నుండియు విముక్తి గలదై యుండును. అప్పుడు పరమార్థ తత్వమును, పారమార్థిక ధర్మమును మాత్రము తెలిసికొనవలసినదను ప్రేరేపణ యాత్మకు కల్గును. అత్తరి మనస్సు పరబ్రహ్మములోనికి చేరిపోవును. బుద్ధి బ్రహ్మతత్త్వ నిర్ణయములోనికి జరుగును. చిత్తము బ్రహ్మచింతనము లోనికి ప్రవేశించును. అహంకారము సోహంకారములోనికి వెళ్ళిపోవును. నేత్రేంద్రియముతో చూచునదంతయు, దైవమయముగా జూచుటకు తగిన యవస్థ కల్గియుండును. జిహ్వేంద్రియము సర్వవిధ రసములను విడిచిపెట్టినదై బ్రహ్మద్యాన రసామృతమునుగాని, భగవద్భక్తిపీయూషమును గాని, పానముజేసి తృప్తి నొందియుండును.

ఘ్రాణేంద్రియము ఏ గంధమును గోరక తూష్ణీంభావావస్థను బొంది యుండును. ఆలాగున కర్మేంద్రియములలో వాగింద్రియము మౌనమును దాల్చియుండును. పాణీంద్రియము నిశ్చేష్టత కల్గి ఏమియూ చేయక అత్యవసరమైన దేహధారణ కార్యమును మాత్రము చేయును. పాదేంద్రియము, దానియొక్క పనిని ముగించి అనివార్య దేహ కృత్యమును నిర్వహించుటలోను, దైవతత్వమును బోధించుటకు వెళ్లుటలోను కొంచెము ప్రయత్నము కల్గియుండును. ఉపస్థేంద్రియము ఏ వికారము నొందక దేహ సంరక్షణకు జల విసర్జనము మాత్రము చేయుచుండును. పాయ్వింద్రియము శరీర నిర్వహణ కొరకు మల విసర్జన మాత్రము చేయును. ఇదియే విశుద్ధ తత్త్వము కల్గునప్పుడు గల్గెడి అవస్థగా నుండును. ఇచ్చట జీవన్ముక్తి కల్గియుండును. ప్రత్యగాత్మ స్పష్టముగా గోచరించును. ఇదే ప్రకృతి నశించిన పుణ్యజీవుల లక్షణముగా నుండును. ఇంద్రియములు సుషుప్తి బొందవలెననియు, మృతినొంద వలెననియు శాస్త్రములు చెప్పుటలో ఇదే అర్థమని గ్రహింపవలెను.

సుషుప్తిలో ఇంద్రియములన్నియు ఉన్ననూ ఏలాటి వికారము ఎట్లు కలుగక యుండునో, ఆలాగున జాగ్రదవస్థలో, దృశ్యవిషయములలో వికారము పొందక యుండుటే సుషుప్త్యవస్థ యగును. మృతి నొందినవానికి దృశ్యము తోచనట్లు దైవభావమున కన్యముగా దృశ్యము కలుగక యుండుటే యింద్రియము మృతి నొందవలెనని చెప్పిన దానికర్థముగాని, మరియొకటి కాదు. మరియు ఈ విశుద్ధేంద్రియములు పరిపక్వస్థితికి వచ్చిన అవస్థలో ఇంద్రియ నిగ్రహము లేదు. ఏలన? విషయములనుండి వశపరచుటకు గదా! నిగ్రహము కావలసివచ్చినది. అనగా ఇంద్రియార్థముల నుండి ఇంద్రియములను స్వాధీనము చేసికొనుటకు గదా! నిగ్రహము కావలసివచ్చినది. లేక వశముగాని దానిని వశపరచుకొనుటకు గదా! నిగ్రహమవసరమై వచ్చినది. ఇది ద్వైతజ్ఞానమే గాని ద్వంద్వాతీత జ్ఞానము గాదు.

విశుద్ధావస్థలో ఏకైకరసమగు సద్వస్తువొక్కటి మాత్రమే గలదు. అచ్చట దృశ్యమును, దృక్కును ఒకటిగానే యుండును. అచ్చట ధ్యానమును, ధ్యేయమును ఏకమై యుండును. అచ్చట రాగము లేనందున విరాగమును

Scanned by CamScanner

లేదు. అచ్చట అపేక్ష లేనందున ఉపేక్షయును లేదు. అచ్చట అజ్ఞానము లేనందున జ్ఞానమును లేదు. వియోగము లేనందున యోగమును లేదు. అచ్చట అశుద్ధము లేనందున శుద్ధమును లేదు. అచ్చట అసత్యము లేనందున సత్యము మాత్రమే యుండును. అచ్చట దృశ్యము లేనందుచే దృక్కు మాత్రమే గలదు. అచ్చట ధ్యాత లేనందున ధ్యేయము మాత్రమే కల్గును. అచ్చట ప్రపంచము లేనందున దైవము మాత్రమే యుండును. అచ్చట ద్వైతము లేనందున అద్వైతము మాత్రమే యుండును. అచ్చట నుండునది సత్, చిత్, పరమానందము, బ్రహ్మానందము. ఇవియే ఇంద్రియములు విశుద్ధములయి నప్పుడు గల లక్షణములు. ఈ యవస్థయే పరిపూర్ణావస్థ యగును. ఇదే జీవులచే పొందదగిన గమ్య స్థానము. అచ్చట మాత్రమే నిలకడ కల్గును. అంతవరకును ఉన్నతోన్నత పదవులను, ఉన్నతోన్నత జన్మములను, ఉన్నతోన్నత లోకములను ఈ జీవులు పొందియే తీరవలయును.

యతిగీత

- ఆంగ్లమూలం శ్రీ స్వామి వివేకానంద

ఎత్తిపాడుము కంఠము ఎత్తిపాడు
యతివరా ! ధీర! ఓం తత్సదనుచుపాడు
అవని జల్లిన దెద్దియో అదియెపండు
కారణంబును బట్టియే కార్యముండు
చెడ్డ చెడ్డకును మంచి మంచికిని గల్గు
దీని తప్పించుకొనుటకు తెరవులేదు
రూపుతో బంధనంబుండు రూఢముగను
అన్నిటిని మీరియున్నది యాత్మ గాన
ఆత్మకును రూపనామధేయములు లేవు
అదియె నీవను భావంబు మదినెఱింగి
ఎత్తిపాడుము కంఠము ఎత్తిపాడు
యతివరా! ధీర ! ఓం తత్సదనుచుపాడు

ఇదే మన లక్ష్యం

- శ్రీ స్వామి చిన్మయానంద

"నిన్ను నీవు ఉద్ధరించుకో" ఇదే మన లక్ష్యం. ఎటువంటి పరిస్థితులలోనైనా నీలో అహంకారము ఏ రూపంలోనైనా పెరగకుండా జాగ్రత్తపడాలి. మనమంతా కేవలం సాధకులమే, సిద్ధపురుషులం కాదు. నిజానికి మన జ్ఞానాన్ని పెంచుకునే ప్రయత్నంలో భాగంగా జ్ఞానాన్ని ఇతరులతో పంచుకుంటున్నాము. తమిళనాడులో నున్న కుర్తాళం జలపాత ధారలలో నీవు స్నానం చేయాలంటే ముందు నీ శరీరమంతా నూనెతో మర్దన చేసుకోపోతే నీ చర్మము పగిలిపోతుంది. అక్కడ సర్వసాధారణంగా కనిపించే దృశ్యమేమిటంటే యాత్రికులలో మరొకరు అడగకుండానే ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. అవతలివారు తెలియనీ, తెలియకపోనీ ఫరవాలేదు. నీ ప్రక్కవారి నడిగితే చాలు సహాయం చేస్తారు. అలాగే మిషన్ సత్సంగాలలో కూడా నీవు గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా అర్థం చేసుకున్న కొద్ది విషయాలనైనా సరే ఇతరులకు వివరించడానికి ప్రయత్నం చేయి. నీకు అర్థం కానివి ఇతరుల సహాయంతో తెలుసుకో. కాబట్టి నిన్ను నీవు ఉద్ధరించుకోవడం అత్యవసరమన్నమాట. మీరు ఇతరులను కలుసుకున్నప్పుడు ఈ భావననే అందించండి. మిషన్ యొక్క అసలైన లక్ష్యము ఆత్మోద్ధరణమే. మరేమీ ఫరవాలేదు! దేశం నీ కోసం వేచి వుంటుంది!

కాబట్టి సంస్థలలో ఉన్న వ్యక్తుల యొక్క దృష్టి యావత్తూ వ్యక్తిత్వ వికాసం వైపు మళ్ళించాలి. శాస్త్రాలను శ్రవణం చేయడంతోపాటు అధ్యయనం చేసుకుంటూ ఆత్మపరిశీలన కూడా చేసుకోవాలి. నీవు సంపాదించిన జ్ఞానాన్ని పెట్టుబడిగా ఉపయోగించుకుని నీ వెంతవరకు అభివృద్ధి సాధించగలుగు తున్నావో ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. **ప్రపంచాన్ని బాగు చేయాలని పరుగులెత్తవద్దు. నీవు వ్యక్తిగతంగా బాగుపడుతూ వుంటే నీవు చేసే సేవ కూడా మెరుగౌతూ ఉంటుంది.** చిన్మయామిషన్ వున్నది ఎందుకు? ఎప్పుడూ బయటి ప్రపంచంలోనికి తిరిగి చూడటానికి కాదు. సంస్థను పెంచడానికి

Scanned by CamScanner

కూడా కాదు. మీలో ప్రతి ఒక్కరూ ఆంతరంగికంగా పురోగమనం సాధించడమే ఏకైక లక్ష్యము. ఇప్పటివరకు బయటి ప్రపంచంలో ఎంత పనిచేశాను? అని ఆలోచిస్తూ కూర్చోకండి. అతి పవిత్రమైన శీలము, ప్రవర్తనకల వ్యక్తులు మిషన్‌కు అత్యవసరము. **నిజాయతీ, నిరంతర ఆత్మపరిశీలన అనివార్యము.** ఎన్ని భవనాలు నిర్మించాము. ఎన్ని సంస్థలు మనకున్నాయనేది ముఖ్యం కాదు. మన ఆశయం అది కాదు. ప్రతి వ్యక్తి కూడా ఒక సంస్థగా మారడానికి ఎంత ప్రయత్నిస్తున్నామనే విషయంలోనే మనము ఆసక్తి చూపాలి. **'నేను' అనే అహంకార భావం వదిలించుకోవడానికి సేవ చేయడం అవసరం.** మనం చేసే ప్రతి పనికి వెనుక **"నారాయణుడే" వుండి నిజంగా పనిచేస్తున్నాడనే విశ్వాసంతో, ఆత్మసమర్పణ భావంతో పనిచేయాలి.** మనం ఆయన చేతిలోని పరికరాలం మాత్రమే. ఈ సమర్పణ భావనను పెంపొందించుకోవడమే ఉత్తమోత్తమమైన సాధన. అన్నింటికంటే ముఖ్యమైన అంశమేమిటంటే కార్యకర్తగా నీవు ఎక్కడికి వెళ్ళినా నీతోపాటు ఆంతరంగిక శాంతిని వ్యాపింప చేయగలగాలి. ఈ సమతుల్యమైన స్థితిలో వుండగలిగినవ్యక్తియే నిజమైన సేవకుడు కాగలడు.

(అరణ్య స్పందన - నుండి)

వేదాన్తభేరికి ఈక్రిందివారు పోషకచందా పంపినారు

(1).	డా॥ కె.సి.ఎం. ఈశ్వరప్రసాద్ (కల్యాణ దుర్గం)	రూ. 1500/-
(2).	పి.దుర్గాప్రసాద్ (శృంగవృక్షం) -	రూ. 1500/-
(3).	సి.మోహనరావు (కర్నూలు) -	రూ. 2500/-
(4).	యు.ఎ.బి.సుబ్రమణ్యం (పప్పులగూడ, హైద్రాబాద్) -	రూ. 2000/-
(5).	దుంపేటి రామకృష్ణ (కోటర్‌మూరు) -	రూ. 1500/-
(6).	అశోక్‌రెడ్డి చెరుకుపల్లి (హైదరాబాద్) -	రూ. 1600/-
(7).	కె.కిషన్ (ఆల్వాల్, సికింద్రాబాద్) -	రూ. 1515/-
(8).	యు.ఎస్.ఎన్.రాజు (కాకినాడ) -	రూ. 1516/-

అందరికి దీపావళి శుభాకాంక్షలు

ధర్మ సూక్ష్మాలు

- డా ॥ నముద్రాల లక్ష్మణయ్య

ధర్మతత్త్వం తెలిసిన పెద్దలు మహాభారతాన్ని ధర్మ శాస్త్రమన్నారు. ధర్మ స్వరూప నిరూపణంలో మహాభారత కర్త వేదవ్యాసమహర్షి నిరుపమానమైన మేధా వైభవాన్ని ప్రదర్శించాడు. భారతం పంచమ వేదంగా ప్రశస్తి పొందింది.

'ధర్మ'మంటే ఏమిటి? ధర్మస్వరూపం సర్వకాల సర్వావస్థలలో స్థిరంగా వుంటుందా? ధర్మాన్ని పాటించడం వల్ల కలిగే ప్రయోజనమేమిటి? పాటించకపోతే వచ్చే నష్టమేమి? ఇత్యాది విషయాలను వివేకవంతులైనవారు చర్చించి నిర్ణయించుకోవాలి. ఇందుకు మహాభారతం ఉపకరిస్తుంది.

"ధారణాద్ధర్మ ఇత్యాహుర్ధర్మో ధారయతే ప్రజాః" అని ధర్మ శబ్దం నిర్వచించబడింది. ఒక మంచి వ్యవస్థను విచ్ఛిన్నం కానీకుండా ఏది ధరించి వుంటుందో, అదే ధర్మమనబడుతుంది. ఈ జగత్తులోని ప్రజానీకాన్ని విపత్తుకు గురికాకుండా పట్టుకొని రక్షించేదే ధర్మం.

ప్రవృత్తి ధర్మం, నివృత్తి ధర్మం - అని ధర్మం స్థూలంగా చూస్తే రెండు విధాలుగా గోచరిస్తుంది. కాలానుగుణమైన ఆచారవ్యవహారాలకు సంబంధించిన ధర్మాన్ని ప్రవృత్తి ధర్మమంటారు. ప్రాపంచిక జీవితం పట్ల నివృత్తిని కల్గించేదే నివృత్తి ధర్మం. ఇది సర్వసంగ పరిత్యాగులకు అన్వయిస్తుంది.

ప్రవృత్తి ధర్మాన్ని 'మనుస్మృతి' మున్నగు ధర్మశాస్త్రాలు విస్తృతంగా నిరూపించాయి. అందులో అనేక ధర్మాలు కాల- దేశ- పాత్రానుగుణంగా మార్పు చెందుతూ వుంటాయి. యుగభేదాన్ని బట్టి స్మృతులలో చెప్పబడిన ధర్మాలలో మార్పు తప్పదు.

కృతేతు మానవాధర్మాః త్రేతాయాంగౌతమాః స్మృతాః
ద్వాపరే శంఖలిఖితాః కలౌ పారాశరాః స్మృతాః ॥

మనువు చెప్పిన ధర్మాలు కృతయుగానికే పరిమితాలు. త్రేతాయుగంలో

Scanned by CamScanner

గౌతమ స్మృతిలోని ధర్మాలను పాటించాలి. ద్వాపరయుగంలో శంఖలిఖిత స్మృతి ఆచరింపదగినది. కలియుగంలో పరాశరుడు ప్రతిపాదించిన ధర్మాలు అనుసరణీయాలు.

ఇలా యుగానుసారంగా ధర్మాచరణలో తేడాలు గమనించవచ్చు. ఒకప్పుడు 'అస్పృశ్యత' మున్నగు ఆచారాలు ధర్మాలుగా పాటింపబడేవి. నేడు అవి శిక్షార్హమైన నేరాలు. పరాశరుడు చెప్పినవి గూడా ఈ యుగంలో పాటింపబడడంలేదు. దాని స్థానంలో అంబేద్కర్ స్మృతి ఆచరణలోకి వచ్చిందని చెప్పవచ్చు.

ఒకనాటి సదాచారం మరొక నాటికి దురాచారంగా పరిగణింప బడుతున్నది. అందుచేత ధర్మతత్త్వం అతిగహనమైనదిగా భావింప బడుతున్నది.

మరొక ముఖ్య విషయం. నాటి ధర్మశాస్త్రాలు, అప్పటి సమాజంలోని వర్ణ విభాగానికి అనుకూలంగా ధర్మాలను విధించాయి. కాని నేడు వర్ణ వ్యవస్థను సమాజం అంగీకరించదు. అది నేటి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనది. అందువల్ల వర్ణాది భేదాలను బట్టి పూర్వం స్మృతులు పేర్కొన్న ధర్మాలకు నేడు విలువలేదని గ్రహించాలి.

ఉత్తమ ధర్మం 'ఏది' అన్న విషయాన్ని భారతం ఇలా నిరూపించింది.

యదన్యైర్విహితం నేచ్ఛే దాత్మనః కర్మ పురుషః ।
న తత్పరేషు కుర్వీత జానన్నప్రియమాత్మనః ॥

ఈ శ్లోకాన్నే తిక్కన ఇలా అనువదించాడు.

ఒరులేయవి యొనరించిన
నరవర! అప్రియము తన మనంబున కగు, తా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్.

ఇతరులు తనకు ఏది చేస్తే తన మనస్సు బాధపడుతుందో, అట్టి

పనిని తాను ఇతరులకు చేయకుండా వుండడమే ఉత్తమ ధర్మమని భావం.

'ఆత్మనః ప్రతికూలాని పరేషాం న సమాచరేత్' అన్న సూక్తి యొక్క తాత్పర్యం కూడా ఇదే.

భారతాన్ని యుక్తితోనూ, భాగవతాన్ని భక్తితోనూ, అర్థం చేసుకోవాలని –

'భక్త్యా భాగవతం జ్ఞేయం యుక్త్యాజ్ఞేయంచ భారతమ్ '। అన్న సూక్తి వివరిస్తున్నది. అందుచేత భారతంలోని ధర్మతత్త్వాన్ని నిర్ణయించేటప్పుడు సూక్ష్మ పరిశీలనాత్మకమైన యుక్తితో నిర్ణయించాలి. కేవలం శబ్దార్థ పరిజ్ఞానం అందుకు చాలదు.

భారతంలో భీష్ముడు ధర్మజునకు పలు ధర్మాలు బోధిస్తాడు. ధర్మరాజు "పితామహా! అనుష్ఠింపదగిన ముఖ్య ధర్మాన్ని బోధించండి!" అని ప్రార్థించగా భీష్ముడు –

"విను తల్లియును దండ్రియును గురుండును సేవనీయులు సద్భక్తి నిత్యనిరతి, వారల గొలుచుచు వారెద్ది చెప్పిన నది యాచరించుట యధిక ధర్మము " అని బోధిస్తాడు. వేదం కూడా

'మాతృ దేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ!' అని సనాతన ధర్మాన్ని బోధించింది. పంచమ వేదమైన భారతం భీష్ముని మాటలలో ఆ విషయాన్నే ఇక్కడ నిరూపించిందని గ్రహించాలి.

ధర్మ సమ్మూఢ మనస్కుడైన అర్జునుడు రణరంగంలో యుద్ధ విముఖుడైతే, శ్రీకృష్ణుడు అతనికి ఆత్మానాత్మ వివేకం బోధించి అతణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేశాడు. కాబట్టి ధర్మతత్త్వం గ్రహించడానికి ఆత్మజ్ఞానం ఉపకరిస్తుందని భగవద్గీత ద్వారా తెలుస్తున్నది. కొన్ని ధర్మ సంశయాలు మామూలు ప్రబోధాలతో తొలగవు: ఆత్మతత్త్వ ప్రబోధంతోనే అవి తొలగుతాయని గ్రహించాలి.

అందుకే భగవంతుడు "అధ్యాత్మ విద్యా విద్యానాం" – "విద్యలలో నేను అధ్యాత్మ విద్యను" అని చెప్పి ఆత్మ విద్యా ప్రాముఖ్యాన్ని చాటాడు.

వేదం 'సత్యం వద' అని చెప్పింది. కాని మన జీవితంలో సత్యం చెప్పుటకు వీలుగాని సందర్భాలు కొన్ని తటస్థిస్తాయి. అప్పుడు సత్యాన్ని

Scanned by CamScanner

నిర్వచించే తీరు మారుతుంది. భారతమే ఇందుకు ప్రమాణం.

యద్భూతహిత మత్యంతం తత్సత్యమితి ధారణా ।

విపర్యయకృతోఽధర్మః పశ్య ధర్మస్య సూక్ష్మతామ్ ॥

ఏది ప్రాణులకు హితకరమో అదే సత్యం. అలా కాకపోతే అది అధర్మమే అవుతుంది. ధర్మ సూక్ష్మ మెట్టిదో గ్రహించండి - అని భావం.

ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం సత్యం. అలా చెప్పడం వల్ల ప్రాణులకు కీడు కల్గితే - అది సత్యం కాజాలదు. భూతహితమైన అసత్యమైనా సత్యమే అవుతుంది. ధర్మసూక్ష్మం అలా వుంటుంది.

ప్రాణాంతక కాలంలోనూ, వివాహంలోనూ అసత్యం చెప్పినా అది సత్యం క్రిందికే వస్తుంది. సత్యా సత్యాలు తల్లక్రిందులయ్యే ఇట్టి సందర్భాలు జీవితంలో ఎదురవుతాయి.

అశ్వత్థామ విషయంలో ధర్మజునిచేత శ్రీకృష్ణుడే అసత్యం చెప్పించాడు గదా! పాండవ ప్రాణ రక్షణకై అలా చేయవలసి వచ్చింది.

మము నీతని కొప్పింపక

సముచితముగ గాచికొను మసత్యవచన దో

షములేదు ప్రాణరక్షణ

సమయంబున నతని కొడుకు సచ్చెన యనుమీ! అని కృష్ణుడు చెప్పిన మాట గమనార్హం.

సుఖ దుఃఖాలు పుణ్య పాపాలకు ఫలాలని శాస్త్రాలు చెబుతున్నాయి. కాని పుణ్యాత్ములు కష్టాల పాలు గావడం, పాపాత్ములు సుఖంగా వుండడం లోకంలో గమనిస్తుంటాము.

ఇక్కడ ధర్మమేమైనది? అన్న ప్రశ్న వస్తుంది. దీనికి భారతం ఇలా సమాధానం చెప్పింది -

కదాచిత్సుకృతం తాత! కూటస్థమివ తిష్ఠతి ।

మజ్జమానస్య సంసారే యావద్దుఃఖా ద్విముచ్యతే ॥

పాపం కర్మకృతం కించిద్యది తస్మిన్నదృశ్యతే ।

నృపతే ! తస్య పుత్రేషుపౌత్రేష్వపిచ నప్తృషు ॥ దీని భావమిది-

ధర్మాత్ముడు చేసిన పుణ్యం ఒక్కొక్కసారి వెంటనే ఫలప్రదం కాదు, గూఢంగా వుంటుంది. పూర్వ కృతపాపాలఫలంగా అతడు దుఃఖానికి గురి అవుతాడు. దుఃఖానుభవం పూర్తి అయిన తరువాత అతనికి సుఖం కల్గుతుంది. ఒకవేళ పాప ఫలమైన దుఃఖం అతనికి జన్మాంతం వరకూ కలగని పక్షంలో అతని పుత్రులలోనో, పౌత్రులలోనో అది కల్గి తీరుతుంది. చేసిన పుణ్య పాపాల ఫలాన్ని ఎన్నటికైనా అనుభవించక తీరదు. "అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్" అన్న మాటలోని ఆంతర్యమిదే.

ఇక్కడ యుగాలను గురించి కూడా ప్రస్తావించాలి. ధర్మం నాల్గు పాదాలు స్థిరంగా వుంటే కృతయుగమనీ,, పాదలోపం వల్ల యుగభేదం ఏర్పడుతుందనీ అనడం కద్దు.

కాని కృతయుగంలో హిరణ్యకశిపుడూ, ప్రహ్లాదుడూ ఇరువురూ ఉన్నారు. త్రేతాలో రామ రావణులూ, ద్వాపరంలో కౌరవ పాండవులూ ఉండినారు. అట్లే శ్రీరామకృష్ణ పరమహంస వంటి మహాత్ములూ, ఔరంగజేబు వంటి దురాత్ములూ కలికాలంలో ఉండినారు. అంచేత ధర్మాత్ములు ఒకే కాలానికి పరిమితమై ఉంటారని చెప్పలేము. అన్ని కాలాలలో, అన్ని మనస్తత్వాలు కలవారుంటారు.

కాలం మానవుని ప్రవర్తనపై ఆధారపడి వుంటుందికాని, ప్రవర్తన కాలంపై ఆధారపడి వుండదు. "రాజాకాలస్య కారణమ్" అన్న భారత సూక్తికి తాత్పర్యమిదే. యుగ భేదాల తత్త్వం గురించి శ్రీ మలయాళస్వామీజీ తమ గీతలోని 'యుగ నిర్ణయయోగం'లో చక్కగా నిరూపించియున్నారు.

అందుచేత ధర్మ స్వరూప నిరూపణం అనేక దృక్కోణాల నుండి చేయాలి గాని, ఏకముఖంగా చూస్తే అందలి సూక్ష్మతత్త్వం గోచరించదు.

దయగల హృదయమే భగవన్నిలయము

మూలం:
శ్రీ వ్యాసమహర్షి

ఉద్ధవ గీత

అనువాదం:
యేలేశ్వరపు హనుమరామకృష్ణ

శ్రీ కృష్ణుడు : యోగము : సాధకుడు సర్వ జగద్విషయాల నుండి ధ్యాసను ఉపశమింపజేసి, ఈ దృశ్య జగత్తు ఏ ఆత్మయందు స్వయం కల్పనా చమత్కృతిగా కల్పితమై కనిపిస్తోందో... అట్టి నా పరమాత్మ వైభవమునందు అతని ధ్యాసను నిశ్చలం చేసి వుంచటం!

(లేక) గుణమయమగు జగత్తులో కనిపించే సహజీవులందరినీ పరమాత్మ యొక్క ప్రదర్శనాచమత్కార విన్యాసంగా సందర్శించటాన్ని సర్వదా అభ్యసించటం! ఇదియే సనకుడు మొదలైన యోగశాస్త్ర ప్రావీణ్యులగు శిష్యులకు నేను ఒకానొక సందర్భంలో సిద్ధాంతీకరించి చెప్పటం జరిగింది!

ఉద్ధవుడు : ఓ కృష్ణా ! మీరు ఎప్పుడు ఏ సందర్భంలో సనకుడు మొదలైన యోగ పండితవరేణ్యులకు గురువులై యోగశాస్త్రం బోధించారో... నాకు తెలుసుకోవలెనని కుతూహలంగా ఉన్నదయ్యా!

శ్రీకృష్ణుడు : విను! చెప్పుతాను!

హంస ప్రవచనం ఒకానొకప్పుడు ఒక సందర్భంలో బ్రహ్మ మానస పుత్రులైనట్టి సనకుడు, సనందుడు మొదలైనవారు తమ తండ్రియగు బ్రహ్మదేవుని సమీపించి ప్రణామములు సమర్పించి... ఈ విధంగా ప్రశ్నించారు.

సనత్కుమారుడు మొదలైన బ్రహ్మమానస పుత్రులు : సృష్టికర్తా! పితృదేవా! మాదొక సందేహం. యోగం అనే సాధనలో పరాకాష్ఠ ఏమిటి? సుసూక్ష్మము- ఉత్తమము అయినట్టి యోగసాధనము యొక్క అంతిమ ప్రయోజన స్థితి ఏమిటో అభివర్ణించి చెప్పవలసినదిగా ప్రార్థిస్తున్నాం (What is the final state for the practices of yoga?) బ్రహ్మదేవుడు ఆ ప్రశ్నను ప్రశాంతంగా విన్నారు. తాను స్వయంగా అకారణ స్వరూపులు, కారణాలన్నింటికీ **కారణకారణుడు!** అఖిల భూతకారణుడు! అయితే నిరంతరం సృష్టి అనే నిత్య కర్మనిష్ఠుడు అయివుండటం చేత, అనేక రీతులుగా

ఆలోచించి- ఆలోచించి, ప్రయత్నించి యోగ సాధనానంతర పరాకాష్ఠస్థితి ఏమిటో అతని పుత్రులకు అభివర్ణించి చెప్పినా కూడా వారు తృప్తిపడినట్లు కనబడలేదు. ఆ బ్రహ్మమానస పుత్రులు యోగ పరాకాష్ఠను బుద్ధితో గ్రహించి నిస్సందేహులు కాలేదు! అప్పుడు ఆయన తన మానస పుత్రులకు మరింత సమాధానము అందించటానికై నన్ను స్మరించటం జరిగింది. ఆయనయొక్క సంకల్పమును సిద్ధింపజేసే ఉద్దేశ్యముతో నేను హంస రూపంతో ఆయన ముందు ప్రత్యక్షమైనాను.

అప్పుడు సనక -సనందాదులే కాకుండా, బ్రహ్మలోకములోని మునీశ్వరులు, బ్రహ్మదేవునితో సహా వచ్చి నా ఎదురుగా నిలబడి **"మీరు ఎవ్వరు?"** అని ప్రశ్నించారు!

అక్కడి మునులు యోగతత్త్వాన్ని తెలుసుకోవాలనే ఉద్దేశ్యంలో ఉన్నారని గమనించినట్టి నేను ఇట్లా సమాధానం చెప్పాను.

హంస రూప నారాయణ స్వామి : ఓ మునీశ్వరులారా? పరమార్థ వస్తువగు పరమాత్మ యందు నానాత్వమే లేదు. అన్ని నామరూపములకు వేరై -అన్నీ నేనై ఉన్నప్పుడు నేను దేవతనా? జీవుడనా? జీవుడను నేనే ! జీవాత్మనూ నేనే ! పరమాత్మనూ నేనే ! ఇట్లా ఏమైనా చెప్పవచ్చు! అంతా – అన్నీ నేనే అయివుండగా, ఇక నేను ఎవ్వరినని చెప్పమంటారు? ఒక బొమ్మల కొలువులో రాజు -మంత్రి -సైనికులు ....అన్నీ ఒకే మట్టి అయి ఉండగా, "ఓ మట్టీ ! వీటిలో ఎవరు నీవు? రాజువా? మంత్రివా? సైనికునివా?" – అని అంటే ఆ మట్టి ఏమి చెప్పుతుంది?

ఒకవేళ – నేను ఇది! ఈ నామరూపములు కలవాడను! – అని చెప్పాలంటే కూడా ఎట్లా చెప్పను? ఎవ్వరైనా,"నేను ఇది! ఇది కాదు!" అని చెప్పవలసివస్తే వారు కొన్ని జాతి-గుణ-క్రియా సంబంధాలను ఆశ్రయించి మాత్రమే చెప్పటం సాధ్యం కదా! **ఇప్పుడు నేనెవ్వరో మీరు కోరినట్లు వివరించి చెప్పటానికి నేను ఇప్పుడు ఏ జాతి- గుణ- క్రియలను ఆశ్రయించి చెప్పాలో..** అది కూడా మీరే ముందుగా చెప్పండి? అప్పుడు నేను సమాధానం చెప్పుతాను. లేక ... మరొక విధంగా మనం చెప్పుకోవాలంటే...

Scanned by CamScanner

జీవులందరు నారాయణ స్వరూపమే కదా! నారాయణుడు అనగా ఒక జీవుడా? కాదు కదా! సర్వజీవులు తానైనవాడు నారాయణుడు కదా! అందుచే "నీవెవ్వరు? " అనే ప్రశ్నే సరికాదు, సమాధానం ఇవ్వదగ్గ ప్రశ్న కాదు!

పంచ మహాభూత నిర్మిత భౌతిక దేహం దృష్ట్యా : ఈ దేవ - మనుష్య- జంతు దేహాలన్నీ వస్తుతః పంచమహాభూతాలతో తయారైనవే కదా? అందుచేత ఒక దేహధారిని పిలచి, "నీవెవరు" అని ప్రశ్నించటం ఏమి ఉచితం? అన్ని ఆభరణాలు బంగారంతో తయారు అయివుండగా ఒక ఆభరణాన్ని పిలచి నీవెవ్వరు?- అనే ప్రశ్నకు సమాధానం ఏమి చెప్పగలదు? ప్రశ్నించేవాడు, సమాధానం చెప్పేవాడు కూడా ఒకే పంచభూత సమన్వయమే అయి వుండగా!

అందుచేత ఈ దేహం దృష్ట్యా "నీవెవ్వడవు?" అనే ప్రశ్న అర్థరహితం! కేవలం వాచారంభమే! పంచభూతములు- అనే 5 వస్తువుల కలగలపుగా ఒక బొమ్మను తయారుచేసి, ఓ బొమ్మా! నీవెవరు? - అని అడిగితే? మట్టిని అంటుందా? జలమును అంటుందా?

"గాలికి గాలి అనే పేరు ఎందుకు పెట్టారు?"- అనే ప్రశ్నవలె మొదలే అర్థరహితం కదా!. ఒక మట్టి బొమ్మకు ఎక్కడో మట్టి కనబడితే "ఓ మట్టీ? నీవెవరు?" అని ప్రశ్నించనట్లున్నది మీ ప్రశ్న- అని మరల గుర్తు చేస్తున్నాను.

అందుచేత ఓ బ్రాహ్మణోత్తములారా!: ఈ నామ-రూపాలు నేను కాదు.

అయితే కూడా... **ఈ మనస్సు చేత, వాక్కు దృష్ట్యా పొందబడేది, చెప్పబడేది.. తదితర ఇంద్రియములచేత పొందబడేదంతా నా స్వరూపమే! నాకు వేరైనది, నేను కానట్టిది ఎక్కడా ఏదీ లేదు! ఉండజాలదు!..** ఈ నగ్న సత్యాన్ని తత్త్వచారణచే ముందుగా జాగరూకులై ఏకాగ్రతతో గ్రహించండి.

సనకాదులు: ఓ పరమహంసోత్తమా! తత్త్వ విచారణ చేసినప్పుడు కదా మీరు చెప్పినట్లు అనిపించేది! జీవులమగు మాకు ఈ కనబడేదంతా నా ఆత్మ స్వరూపమే -అని అనిపించటం లేదు! మేము ఆవిధంగా గ్రహించటమూ లేదు. గమనించటల్లేదు. ఎందుచేత?

హంస: మమాత్మ స్వరూపులగు ఓ బిడ్డలారా! ఈ మానవుల చిత్తము ఇంద్రియ విషయములలో ప్రతిబింబిస్తోంది. అప్పుడు ఇంద్రియ విషయాలు తాము పోయి చిత్తములో ప్రతిబింబించటం జరుగుతోంది. అయితే ఈ మానవుని (జీవుని) వాస్తవ రూపం ఏమిటి?

భౌతిక శరీరమా? కాదు!

భౌతిక శరీరం జీవునిచేత కదలించబడుచున్నట్టిది. జీవుడు పాంచభౌతిక దేహము కంటే విశిష్టుడు! అతడు కదిల్చేవాడు,కదిలేవాడు కాదు! ఆలోచనలు చేయువాడు, ఆలోచనలలోని వాడు కాదు. ఆలోచనా పరిమితుడు కాదు! ఆలోచనలు ఆతని రూపము కాదు!

చిత్తము, విషయములు కూడా ఆతని స్వరూపం కాదు. అవి రెండు ఆతడు ధరించిన ఉపాధి రూపములు మాత్రమే! రంగు చొక్కా ధరించిన వాడు ఆ రంగు చొక్కాగా మారుతాడా? లేదు కదా! అట్లాగే జీవుడు చిత్త విషయములు ధారణ చేస్తున్నప్పటికీ చిత్త విషయములుగా రూపం దిద్దుకోవటం లేదు! ఆ రెండింటికీ అప్రమేయుడైవున్నాడు.

జీపుడు బ్రహ్మమే మూలస్వరూపంగా కలిగి ఉన్నాడు. ఈ జీవుని వాస్తవ రూపం బ్రహ్మమే! దేహ-మనో-బుద్ధి-చిత్త -అహంకారాదులన్నీ అతడు ధరించే ఉపాధిరూపాలేగాని స్వరూపస్వభావాలు కాదు. అవి స్వస్వరూపమునకు సంబంధించినవీ కాదు. అనగా, బ్రహ్మతత్త్వ స్వరూపుడు మనో-బుద్ధి-చిత్త- అహంకారములతోను, దృశ్య సమన్వితుడుగాను కనిపించవచ్చుగాక! అవిగా ఆతడు అవటమే లేదుగా!

జీవాత్మ బ్రహ్మముకాని క్షణమే లేదు. కనుక, మీరు మీ గురించి జీవాత్మలం అని చెప్పుకుంటున్నటికీ, సాక్షాత్ బ్రహ్మమే అయివున్నారయ్యా!

ఈ దేహ -మనో-బుద్ధి-చిత్త-అహంకారాది ఉపాధులు (వస్త్రములవలె) ధరించినప్పటికీ అవి జీవునికి స్వస్వరూపములు కావు. నాటకంలో నటించేవాడు ఆ పాత్రగా మారిపోతాడా? లేక, ఆ పాత్రయొక్క స్వరూప-స్వభావాలు ఆతని స్వస్వరూపం అవుతాయా? లేదు కదా! ఇదీ అంతే !!.

Scanned by CamScanner

సన్న్యాసము యొక్క అంతరార్థము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పెద్దలు జీవితమును నాల్గు ఆశ్రమములుగ విభజించినారు. మొదటిది బ్రహ్మచర్యాశ్రమము, రెండవది గృహస్థాశ్రమము, మూడవది వానప్రస్థాశ్రమము, నాల్గవది సన్న్యాసాశ్రమము అని. నాల్గవ దానికి తురీయాశ్రమము అని కూడ పేరు.

సన్న్యాసాశ్రమ స్వీకరణ సమయమున చెప్పబడు మంత్రములలో త్యాగభావన లెస్సగా ప్రస్ఫుటమగుచున్నది. భూః సన్న్యస్తం మయా, భువః సన్న్యస్తం ఇత్యాది మంత్రముల ద్వారా సన్న్యాసగ్రహీత సమస్తమును త్యజించి వేయుచున్నాడు. విరజాహోమమును చేయునపుడు "కామక్రోధాది దుర్గుణములన్నిటిని నేను జ్ఞానాగ్ని యందు ప్రజ్వలింపజేయుచున్నాను" అని పలుకును.

పిండ ప్రదాన సమయమున సన్న్యాసాశ్రమ గ్రహీత తన తల్లిదండ్రులకు (వారు జీవించియుండగనే), తనకు కూడా పిండ ప్రదానము చేయుచున్నాడు. **దీని భావము దేహముపై అభిమానమును, బంధ్వాదులపై మమత్వమును పూర్తిగా వదలివేయుచున్నాననియే.** ఈ ప్రకారముగ సమస్త దృశ్య ప్రపంచమును త్యజించి తాను తానై మిగిలియుండుటయే. తన ఆత్మలో స్థితిగలిగి యుండుటయే సన్న్యాసి యొక్క కర్తవ్యము. "త్యాగేనైకే అమృతత్త్వమానశుః" అను ఉపనిషద్వాక్యము మోక్షప్రాప్తికి త్యాగమే ఏకైక సాధనమని చెప్పినది. కాబట్టి అట్టి మహోన్నత లక్ష్యమును జీవితంలో సాధించి దృశ్యముపై విరక్తి గలిగి ఆత్మయందు స్థితిని సంపాదించి పరమానందముననుభవించవలెను.

బ్రహ్మచారి గోపాల్‌గారు మహోన్నతమగు ఇట్టి సన్న్యాసాశ్రమమును స్వీకరించి విద్యాస్వరూపానందగిరిస్వామి అను నూతన నామధేయముగా బడసి తాను తరించి ఇతరులను తరింపజేయుటకై లోకానికి ఒక చక్కని ఆదర్శమును చూపినారు. భగవదనుగ్రహముచే వారు లోకమునకు ద్విగుణీకృతమగు సేవ యొనర్చి ధన్యులు కాగలరని విశ్వసించుచున్నాము. (16-05-1994న గోపాల్‌గారి సన్న్యాస స్వీకార సందర్భమున పూజ్యశ్రీ స్వాములవారి సందేశమిది. 1994 జూలై సద్గురువాణి పత్రిక నుండి సంగ్రహింపబడినది.)

సన్న్యాసము

– శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మనిష్ఠ
శ్రీ కైలాస పీఠాధీశ్వర ఆచార్య మహామణ్డలేశ్వరులు
శ్రీ మత్స్వామి శ్రీశ్రీశ్రీ విద్యానందగిరిజీ మహారాజ్
(కైలాసాశ్రమం, ఋషీకేశ్)

"న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనేకే అమృతత్త్వమానశుః",

"బ్రహ్మ సంస్థోమృతత్త్వమేతి" అను శ్రుతి వాక్యములచేత ఏ సన్న్యాసానికి అమరత్వం, మోక్షం ఫలమో ఆ సన్న్యాసాశ్రమం సిద్ధిస్తుంది. జ్ఞానం ద్వారా మోక్షం లభించునని ప్రాయశః శ్రుతులన్నియు వక్కాణించుచునే యున్నవి. కాని ఏ బ్రహ్మజ్ఞానం చేత మోక్షం చెప్పబడిందో ఆ బ్రహ్మజ్ఞానము చతుర్థాశ్రమంలోనే (సన్న్యాసాశ్రమంలోనే) సులభము. ఆయా ఆశ్రమ విధులను, కర్మలను నిర్వహించుచు బ్రహ్మ సంస్థితిని సంపూర్ణంగా పొందలేము. అప్పుడు సంపూర్ణ త్యాగము చేయుట కూడా కుదరదు. దేహాభిమానం గల వ్యక్తి వర్ణాశ్రమ విధిని నిర్వహింపక మోహవశుడై దానిని త్యజించునపుడు ఆ త్యాగము మోక్ష హేతువు కాజాలదు. అది తామస త్యాగమగుటచే అనర్థహేతువగుచున్నది. కనుక సాత్త్విక త్యాగము, బ్రహ్మనిష్ఠ అనునవి తురీయాశ్రమము నందే సంభవమగును. మోక్షసాధనమైన ఈ త్యాగము, బ్రహ్మనిష్ఠలకు మానవమాత్రుడు అధికారి. అనగా మోక్షాభిలాషగల ఏ వ్యక్తియైనను పైన పేర్కొనబడిన సాత్త్విక త్యాగ, బ్రహ్మ నిష్ఠరూపమైన సన్న్యాసమును స్వీకరింప అర్హుడు. ఇట్టి సన్న్యాసమును అలింగసన్న్యాసమని అంటారు.

'తమేతం బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసానాశితేన' అన్న శ్రుతి ననుసరించి యజ్ఞము, దానము, తపస్సు, ఉపవాసాది సాధనములు బ్రహ్మజ్ఞాన కారణములు కావు. కానీ అవి బ్రహ్మ జిజ్ఞాసకు కారణములు కాగలవు. అదిగాక ఇటువంటి సాధనములు పట్ల జాతిచేత బ్రాహ్మణులైనవారికి మాత్రమే అధికారము గలదు. ఇది భగవత్పాదులు

Scanned by CamScanner

శ్రీ ఆదిశంకరాచార్యుల అభిప్రాయము. కాని ఈ శ్రుతివాక్యమున ఉల్లేఖింపబడిన బ్రాహ్మణ శబ్దము 'బ్రహ్మజిజ్ఞాసువు' అనే అర్థములో ప్రయోగింపబడినది. కనుక ఇది త్రైవర్ణికుల (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) ఉపలక్షణమని వార్తికకారులు శ్రీసురేశ్వరాచార్యుల వ్యాఖ్యానము. త్రైవర్ణిక సంన్యాస సాంప్రదాయాన్ని అంగీకరించేవారు శ్రీసురేశ్వరాచార్యుల అభిప్రాయాన్నే ప్రమాణంగా స్వీకరిస్తారు. ఏది ఎలా వున్నా ఈ భారతవర్షము నందు పై రెండు సంప్రదాయాలు కనిపిస్తూనే ఉన్నవి.

విద్వత్సన్న్యాసము, వివిదిషా సన్న్యాసము, ఆతుర సన్న్యాసము అని సన్న్యాసము యొక్క అవాంతర భేదములు చెప్పబడినవి.

1. బ్రహ్మజ్ఞానము కలిగిన తరువాత జీవన్ముక్తి వలన కలుగు విలక్షణ ఆనందానుభూతిని పొందుటకై కర్మను, దాని ప్రతీకాలైన శిఖ సూత్రాదులను విధిపూర్వకంగా వర్జించినపుడు దానిని విద్వత్ సన్న్యాసమనెదరు. మరికొందరన్ననో విధిపూర్వకంగా కాక స్వేచ్ఛతో కర్మను, దాని ప్రతీకలైన శిఖా సూత్రాదులను త్యాగము చేయుటను విద్వత్ సన్న్యాసమనెదరు. దీనిమూలంగా వారి అనభిజ్ఞత మాత్రమే గోచరించుచున్నది. ఇది కూడ శాస్త్ర సమ్మతం కాదు.

2. బ్రహ్మతత్త్వమును తెలిసికొనుటకై విధివత్సంన్యాసమును గైకొనుటను వివిదిషా సంన్యాసమని అందురు. ఇది ఆచార్యుని సన్నిధిలో అతని ఆదేశ ప్రకారము నెరవేర్చబడును. తదనంతరము ఆచార్యుని ద్వారా లభించిన సాధనమునులను సాధకుడు దృఢముగా జీవితాంతము సాధన చేయుటలో నిమగ్నుడై ఉండును. తత్త్వసాక్షాత్కారమునకు పూర్వము అతడు మహావాక్యార్థమును ప్రయత్న పూర్వకముగా మననము చేయును. సాక్షాత్కారమైన వెనుక సహజముగనే అతడు మహావాక్యార్థమును గూర్చి చింతన చేయుచుండును. తత్త్వజ్ఞాన సాధనయందు నిమగ్నుడైన బ్రహ్మజిజ్ఞాసువుకు కూడా క్రమముక్తి లభించును. అనగా సాధకుడిప్పుడు ధరించిన దేహమును వదలి బ్రహ్మలోకమును చేరి ప్రస్తుత బ్రహ్మయొక్క శాసనము ముగిసిన పిదప తానున్ను బ్రహ్మ భావమును పొందును. అతనికి పునర్జన్మ కలుగదు. కాని మోక్షసాధనయందు నిమగ్నుడైన సాధకునికి

సాక్షాత్కారము కలిగినపుడు శరీరమును త్యజించి శరీరాంతరమును (మరోశరీరాన్ని) గ్రహించుటకై ప్రాణోత్క్రమణము కలుగదు. 'న తస్య ప్రాణా ఉత్క్రామన్తి అత్రైవ సమలీయన్తే" – ఇటువంటి తత్త్వజ్ఞానియే జీవన్ముక్తుడన బడుచున్నాడు.

ఈ జీవన్ముక్తులలో కూడ అనేక శ్రేణులున్నవి. ప్రవృత్తిపరమైన ప్రారబ్ధము చేత లోకకల్యాణార్థమై శాస్త్రోపదేశాది ప్రవృత్తులందు నిమగ్నుడైన జ్ఞానికి జీవన్ముక్తి చేత కలుగు విలక్షణానందానుభవము నిరంతరము ఉండదు. కాని అటువంటి మహాత్ముని ద్వారా గొప్ప లోకకల్యాణము చేకూరును. అయితే తత్త్వజ్ఞానియై యుండికూడా ఎవనికైతే ప్రవృత్తి ప్రధానమైన ప్రారబ్ధముండదో అతడు నిరన్తర ఆత్మానుభూతి నిమగ్నుడై యుండును. అతనిద్వారా కొంతమంది ఉత్తమాధికారులకు తత్త్వజ్ఞానమునకు వలసిన ప్రేరణము, తత్త్వజ్ఞానమున్ను కలుగును.

3.ఆతుర సన్న్యాసము. విధివత్సన్న్యాసమును స్వీకరించు కోరిక ఉండి కూడ స్వస్థ దశలో ఎవడు ఆ విధముగా చేయలేకపోవునో అటువంటి ముముక్షువును మృత్యువు సమీపించినపుడు అతనికి సాధ్యమైనంతవరకు విధి ననుసరించి ప్రైషమంత్రము, ప్రణవోపదేశము, మహావాక్యోపదేశము చేయబడును. దీనిని ఆతుర సన్న్యాసమని చెప్పుదురు. స్వస్థుడైన పిదప ఆతుర సన్న్యాసి విధివత్సన్న్యాసమును స్వీకరింపగలడు. అలా కాకుండా మరణిస్తే అతనికి ఉత్తమ లోకప్రాప్తి కలుగుతుంది. కనుక ఈ ఆతుర సన్న్యాసము వలన కూడా ఉత్తమ ఫలము కలుగునని తెలియుచున్నది.

ఇంతేగాక కుటీచక, బహూదక, హంస, పరమహంస అనేటటువంటి సన్న్యాస భేదములున్నవి. సాధకులు ప్రయత్నపూర్వకంగా సాధనలను అవలంబన చేసుకోవాలనీ, తత్త్వజ్ఞానియైన సిద్ధ పురుషుడు సాధనామయమైన జీవితాన్ని గడుపుతూ ఇతరులకు అనుకరణీయంగా ఉండాలి గాని స్వేచ్ఛాచరణ చేయరాదు. పైన జెప్పిన సంన్యాసము దాని అవాంతర భేదములు గాక మరేవిధమైన సన్న్యాసము ప్రచారంలో ఉన్నా అది అవైధమని –విధి బాహ్యమని, సర్వదా త్యాజ్యమని తెలిసికోవాలి. వివేకవంతులైన పురుషులు ఈవిషయంలో సావధానంగా వుండాలి.

Scanned by CamScanner

సన్న్యాసాశ్రమం ఎంతో ఖ్యాతిగల అతి ప్రాచీన వ్యవస్థ

- శ్రీ మత్ రంగనాథానంద స్వామీజీ మహరాజ్
(శ్రీ రామకృష్ణ మఠం)

సన్న్యాసాశ్రమం ఆధ్యాత్మిక జీవనంలో ప్రముఖ అంశం. ఇది ఎంతో ఖ్యాతి, గౌరవం గల అతిప్రాచీన వ్యవస్థ. ఇది బుద్ధుని నాటికే ఏర్పడి యుండిన ప్రాచీన వ్యవస్థ. సర్వసంగ పరిత్యాగి అయిన కారణాన సన్న్యాసిని భారతీయులు దైవ సమానునిగా గౌరవిస్తారు. సన్న్యాసులలో శ్రేష్ఠులయిన వారు జనుల ఆరాధనకు పూర్తిగా అర్హులు. బుద్ధుడు, ఆదిశంకరులు, చైతన్య ప్రభువు, రామకృష్ణులు, వివేకానందుడు అవిచ్ఛిన్నంగా తరలివస్తున్న సన్న్యాస సంప్రదాయానికి చెందుతారు. ఈ సంప్రదాయం చరిత్రకు అందని కాలంలో శౌనకమహర్షి, యాజ్ఞవల్క్యుడు, సనత్కుమారుల వంటి వారితో మొదలైంది.

సన్న్యాస దీక్షకు పూర్వం హోమం జరిపిస్తారు. ఆజన్మబ్రహ్మచారులే గాక గృహస్థులు కూడ బ్రహ్మచర్యాన్ని పాటించి సన్న్యాసం తీసుకొనవచ్చు. హోమాగ్ని పరబ్రహ్మకు ప్రతీక. అందులో బ్రహ్మచారి తన కోరికలను, ఇన్ద్రియాలను, చిత్తాన్ని, అహంకారాన్ని ద్రవ్యరూపంలో అర్పించి, సాంసారిక లక్షణాలు ఇసుమంతైనా లేని శుద్ధ ఆత్మగా తనను తాను సాక్షాత్కరించు కొంటాడు. అతనికి కాషాయ వస్త్రాలను ప్రదానం చేసి నూతన నామధేయం ఇస్తారు. అతడు భౌతికంగా మరణించి, ఆధ్యాత్మికంగా జన్మించినాడని చెప్పడానికి సంకేతమిది. ఇల్లు, వాకిలి, ఆస్తి సర్వస్వం త్యజించి ధర్మనిష్ఠమైన జీవితాన్ని చేపట్టుతాడు. ఒంటరిగా ఏకత్వం వైపుగా పయనిస్తాడు. ఎటువంటి భేదభావం చూపక ప్రాణులందరినీ ప్రేమించి అందరి సేవ చేస్తాడు.

సన్న్యాసాశ్రమాన్ని నియమించే, నియంత్రించే వ్యవస్థ హిందూ మతంలో లేదు. భారతీయ సంక్షేమ రాజ్యంలో లోకహితంకొఅకు, లోక సుఖంకొరకు సన్న్యాసులు నిర్మాణాత్మక కృషి చేయగలరు. 'బహుజన

హితాయ బహుజన సుఖాయ' అని అలనాడు బుద్ధుడు తన సంఘానికి ఇచ్చిన ఉత్తేజకరమైన పిలుపునే ఆధునిక భారతదేశంలోని సన్న్యాసులకు స్ఫూర్తినిచ్చుటకు స్వామి వివేకానన్ద పునరుక్తం చేసి త్యాగం, సేవలను వారి ఎదుట గొప్ప ఆదర్శాలుగా నిలిపాడు. స్వామి వివేకానంద బోధనలు, ఆయన గురువు శ్రీరామకృష్ణుల బోధనలు ఆధునిక భారతదేశానికి గొప్ప ఆధ్యాత్మిక శక్తులు. ఆధునిక ప్రపంచపు ఉద్దేశాలకు ఆకాంక్షలకు అనుగుణంగా నవీనమైన ఆధ్యాత్మిక జీవితాన్ని అటు సన్న్యాసులకు, ఇటు గృహస్థులకు ఈ బోధనలు ప్రసాదించగలవు.

భగవంతుడు అంతర్యామి గనుకనే అనుభవ వేద్యుడు. కనుకనే ఆయనను సాక్షాత్కరించుకొనగలం. ఆధ్యాత్మికంగా సామాన్యస్థాయిలో ఉన్నవారికి ఆయన ఎంతో దూరంలో ఉన్నట్లు తోస్తుంది. వారు ఇంద్రియ గోచరంగానే వస్తువును చూస్తారు. కనుక ముఖం పైకెత్తి ఆకాశంవైపు చూస్తూ ప్రార్థిస్తారు. భగవంతుడు పైన ఏదో లోకంలో ఉన్నాడని వారి నమ్మిక. పోతే సూక్ష్మసత్యాలను గ్రహింపగల్గి, ఇంద్రియ విముక్తులైనవారికి భగవంతుడు మనలోనే ఉన్నాడు. ఈ సాక్షాత్కారానికి ధ్యానం అవసరం. యజ్ఞాలు, అర్చనలు, వ్రతాలు మొదటి కోవకు చెందుతాయి. రెండవ దానికి ఆత్మసాక్షాత్కారానికి కావలసిన ఏకైక నియమం మనోనైర్మల్యం. నిర్మలాంతరంగులు ధన్యులు. ఏలయన వారు భగవంతుని దర్శింతురు. దేవుడు ఉన్నాడను నమ్మకం సరిపోదు. ఆ అనుభూతికై ప్రయత్నించాలి. పైన చెప్పినవి రెండూ ప్రామాణికాలే. పోతే మొదటి స్థాయినుండి రెండవ దానికి ఎదగాలి. ఇవి రెండూ కలిస్తేనే ఆధ్యాత్మికవిద్య పూర్తి అవుతుంది.

భగవంతుడున్నాడు అను నమ్మిక నుండి ఆ అస్తిత్వాన్ని అనుభవించి దానిని సాక్షాత్కరించుకోవాలి. సన్న్యాసి త్రికరణ శుద్ధిగా ఇందుకై పాటుపడుతాడు. కాబట్టి సన్న్యాసాశ్రమానికి అంత ప్రాముఖ్యత ఇస్తారు. భగవంతుడు అనుభవ వేద్యుడు. కనుకనే ఆధ్యాత్మిక జీవనం ఒక విజ్ఞాన శాస్త్రం అని పరిగణింపవచ్చు.

Scanned by CamScanner

సంన్యాసులు పరిపూర్ణాంతరంగులు. సంసారి సంసారంలో తిరుగుతూ సంసారంలోనే సుఖసంతోషాలను వెదుకుతాడు. ఆధ్యాత్మిక వ్యక్తి సంతోషాన్ని కర్మల ద్వారా ఇతరులకు పంచిపెట్టుతాడు. ఒక సన్న్యాసిని ఆసుపత్రిలో నర్సుగా పనిచేసినప్పుడు ధ్యానం, ప్రార్థనల ద్వారా తనకు లభించిన ఆనందాన్ని తన పరిచర్యలో ప్రకటిస్తుంది. కనుక ఆమె సేవలో అంకితభావం కనబడుతంది. మనకు ధ్యానమూలంగా ఏమి దొరకునో అది ప్రేమరూపంలో బయల్వెడలును అన్నాడు ఇఖార్ట్‌మిాష్టర్. సన్న్యాసులు పొట్టకూటికి పనిచేయరు. ఆ విషయం (పొట్టకూటివిషయం) దేవుడే చూచుకొంటాడు. వారు దేవుని మహిమలను కీర్తించడానికి కర్మలనాచరిస్తారు.

మొదట్లో భారతీయ సన్న్యాసులు పూర్తిగా తపోమయ జీవితాన్ని గడిపేవారు. కొందరు ఆశ్రమాల్లో నివసించేవారు. కొందరు పరివ్రాజకులై గృహస్థుల భిక్షను స్వీరించేవారు. అడవుల్లోనూ, కొండగుహల్లోనూ, ఒంటరిగా కాని, నలుగురితో సహజీవనం చేస్తూ కాని నివసించేవారు. వారి అవసరాలను గృహస్థులు తీర్చేవారు. కొందరు నిష్ఠాపరులు కందమూలాలు, ఫలాలు ఆరగించేవారు. వీరందరు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా జీవించేవారు.

ఆధునిక కాలంలో సన్న్యాస వ్యవస్థలలో చాలా వానిలో మార్పులు వచ్చాయి. సన్న్యాసులు సాధారణంగా భిక్షకు వెళ్ళరు. మఠాలు ఏర్పఱచుకొని అందులోనే నివసిస్తారు. ఆ మఠాలు గృహస్థులిచ్చే విరాళాలతో నిర్మింపబడతాయి. ఈ ఆధునిక మఠాలు దారిద్ర్య నిర్మూలనకు, నిరక్షరాస్యత, వైద్య సహాయం వంటి సామాజిక సమస్యలతో తలపడుతున్నాయి. ప్రజోపయోగకర పనులు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా మా మఠం ఈ సేవాకార్యాలలో నిమగ్నమై వుంది. ఈవిధంగా ధ్యానాన్ని, కర్మను సమన్వయం చేయుటలో రామకృష్ణమఠానికి వేదాన్తం, గీత. రామకృష్ణ వివేకానన్దుల బోధనలు ఆధారాలు.

(1994 జూలై సద్గురు వాణి నుండి)

ఆంధ్ర మహా భాగవతము

– డా॥ ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

అవిద్యకు లోనైనవాడు జీవుడు. అవిద్య ప్రభావం వల్ల కర్మననుసరించి సంప్రాప్తించిన శరీరాన్ని ధరిస్తాడు. భగవంతుడు యోగమాయతో కూడినవాడు. ఆయన తన యోగమాయా ప్రభావం వల్ల ఇష్టానుగుణంగా జ్ఞానమయ లీలాశరీరాన్ని కల్పించుకొంటాడు. జ్ఞానం వల్ల మోక్షం వస్తుంది. దైవసేవ వల్ల జ్ఞానం సిద్ధిస్తుంది. ఇదంతా విష్ణువు బ్రహ్మతో చెప్పాడు. బ్రహ్మ నిష్కపటంగా తపస్సు చేశాడు. ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. జీవుడికి భగవద్భక్తి మోక్షాన్ని తప్పక సమకూరుస్తుంది. ఈ విషయాన్ని బోధపరిచే ఇతిహాస మొకటి ఉంది. దాన్ని నీకు తెలియజేస్తాను. విను. దానితో నీ సందేహాలన్నీ తొలగిపోతాయి.

పరీక్షిత్తు దేహపరిత్యాగానికి సిద్ధంగా ఉన్నాడు. అలాంటప్పుడు కేవల దైవస్మరణ వల్లనే ఆయనకు ఎక్కువ ఉపయోగం. ప్రపంచ సృష్టి పరిజ్ఞానం వల్ల ఒరిగేదేమీ ఉండదు. అయినప్పటికీ ప్రపంచ సృష్టి క్రమాన్ని గురించి కూడా పరీక్షిత్తు శుకమహర్షిని ప్రశ్నించాడు. అలా ప్రశ్నించడంలో ఆయన ఆశించిన ప్రయోజనమేమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఇక్కడ రెండు ప్రయోజనాలు స్ఫురిస్తాయి. ప్రపంచసృష్టిని గురించి తెలుసుకోవడం వల్ల జ్ఞానానందం కలుగుతుంది. పైగా భగవన్మహిమ పట్ల ఆకర్షణ ఎక్కువౌతుంది. ఈ ఆకర్షణ భగవంతుడికి చేరువయ్యేట్టు చేస్తుంది. ఇక రెండవ ప్రయోజనం మహనీయులు తమ ప్రయోజనాన్ని గాక లోక ప్రయోజనాన్నే ఎక్కువగా ఆశిస్తారు. ప్రపంచాన్ని గురించి శుకమహర్షిని అడిగినప్పుడు పరీక్షిత్తు ఒక్కడు మాత్రమే అక్కడలేదు, మహర్షులెందరో ఉన్నారు. వారికీ లోకానికీ కూడా తన ప్రశ్నకు లభించే సమాధానం ఉపకరించవచ్చు. దీన్ని కూడా దృష్టిలో పెట్టుకొనే పరీక్షిత్తు అలా ప్రశ్నించాడని భావించవచ్చు. పరీక్షిత్తు ప్రశ్నకు లభించే సమాధానంలో

అపార విజ్ఞానం అణగి ఉండడం గమనార్హం. పరబ్రహ్మధ్యానం మాత్రమే బంధవిముక్తి ప్రదమని శుకమహర్షి మాటలు సూచిస్తున్నాయి. దైవసేవవల్ల జ్ఞానమూ, జ్ఞానంవల్ల మోక్షమూ కలుగుతాయని తెలియజేస్తున్నాయి.

బ్రహ్మ తపస్సు :

అది కల్పారంభం. తనకు ఆధారమైన పద్మానికి మూలమెక్కడ ఉందో తెలుసుకోవాలని బ్రహ్మదేవుడికి అనిపించింది. నీళ్ళలో వెదికాడు. పద్మానికి మొదలెక్కడ ఉందో కనుక్కోలేక పోయాడు. మళ్ళీ పద్మం మీదికే వచ్చి కూర్చున్నాడు. సృష్టించాలనుకున్నాడు. దానిక్కావలసిన జ్ఞానం అతనికి స్ఫురించలేదు. చింతాక్రాంతుడయ్యాడు. అప్పుడు 'తప' అనే శబ్దం రెండుసార్లు అతనికి వినిపించింది. ఆ శబ్దాన్ని ఉచ్చరించిన వారెవరో తెలసుకోవాలనిపించింది. నాలుగువైపులా వెదికాడు. ఎవ్వరూ కనిపించలేదు. తపస్సు చేయమని తనకే సూచించారనిపించింది.

బ్రహ్మ తపస్సు చేయడానికే నిశ్చయించుకున్నాడు. ప్రాణాయామాన్ని ప్రారంభించాడు. ఇంద్రియాలనూ, మనస్సునూ వశపరచుకున్నాడు. ఏకాగ్రతతో వెయ్యి దివ్య సంవత్సరాలు తపస్సు చేశాడు. లోకాలు తపించాయి. విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. వైకుంఠం కూడా బ్రహ్మకు కనిపించింది.

ఆ వైకుంఠం తేజోమయం. సత్త్వానికి నెలవు. అక్కడ లోభం, మోహం, భయం ఉండవు. అక్కడికి వెళ్ళిన వాళ్ళు తిరిగిరారు. అక్షడ పక్షులు కూడా విష్ణు ఘనతను వేనోళ్ళా చాటుతుంటాయి. సునందుడు, నందుడు, అర్హణుడు, ప్రబలుడు మొదలైన సేవకులు భగవంతుణ్ణి భజిస్తూ బ్రహ్మకు కనిపించారు. వాళ్ళ రూపాలు హరిరూపంలాగే ప్రకాశిస్తున్నాయి.

గంగానది పుట్టినపాదం కలవాడూ, లక్ష్మీవక్షఃస్కుడు, శేషతల్పుడు, గరుడవాహనుడు, ముక్కోటి దేవతలూ,మునులూ సేవించేవాడు అయిన ఆ హరిని, ఆ పరమేశ్వరుణ్ణి కళ్ళ కరువు తీరేట్లు బ్రహ్మదేవుడు దర్శించాడు. అమితానందంతో ఆయన హృదయకమలం వికసించింది. శరీరం గగుర్పాటు చెందింది. విష్ణువుకు పాదాభివందనం చేశాడు. విష్ణువు ప్రసన్నుడయ్యాడు. బ్రహ్మ శరీరాన్ని నిమిరాడు. ప్రేమతో మాట్లాడాడు.

"కమల సంభవా! ఎండాకాలం తపస్సు చేసినప్పటికీ కపటమునులను నేను మెచ్చుకోను. సృష్టి చేయ్యాలనే ఉద్దేశంతో చాలాకాలం నుంచి తపస్సు చేస్తున్న నిన్ను మాత్రమే మెచ్చుకుంటాను. నీ కోరికేమిటో చెప్పు. ఇప్పుడే నీకు వరమిస్తాను. దేవదేవుడైన నా పాదాలను చూడగానే పాపాలు పటాపంచలైపోతాయి. నాకు నీ మీద అనుగ్రహం కలిగింది. వైకుంఠమంతా నీకు చూపాను. నువ్వు నా మాటలను పాటించే కదా తపస్సు చేశావు. తపస్సు నా స్వరూపమే సుమా ! ఈ తపస్సుతోనే నేను సృష్టి, స్థితి, లయాలు సాగిస్తూ ఉంటాను. నాపట్ల ఏర్పడే భక్తికి తపస్సే మూలధనం. నువ్వు తపస్సు చేశావు కాబట్టి నీ కర్మలూ, మోహమూ తొలగిపోతాయి. నువ్వు ఏమడిగినా ఇస్తాను కోరుకో,"

విష్ణుదేవుడి మాటలకు విధాతమోములు విప్పారాయి. విష్ణువుకిలా విన్నవించుకున్నాడు. "స్వామీ ! నీకు తెలియందిలేదు. అయినా నువ్వు అడిగావు కాబట్టి నా కోరికను నీకు తెలియజేస్తాను. నీ ప్రభావాన్ని తెలుసుకునే తెలివిని నాకు ప్రసాదించు. నేను నీ ఆజ్ఞానుసారం జగత్తును సృష్టిస్తుంటాను. అలా సృష్టించేటప్పుడు బ్రహ్మను కదా అన్న అభిమానం నాలో పొడచూపుతుంది. మహదహంకారాలు తలెత్తుతాయి. వాటిని నశింపజేయమని ప్రార్థిస్తున్నాను. నన్ను దయార్ద్రదృష్టితో అనుగ్రహించు."

బ్రహ్మదేవుడి విన్నపం విని విష్ణుదేవుడు సంతోషించాడు. చెప్పడం మొదలెట్టాడు.

"శాస్త్ర జ్ఞానాన్ని, నా మీది భక్తిని, ఉత్తమమైన నా ఈ సాక్షాత్కారాన్ని నీ మనస్సులో నిలుపుకో. నా స్వరూపం,స్వభావం, ప్రభావం, అవతారాలూ, వాటిలో నేను చేసే పనులు, వీటన్నిటిని గ్రహించే తత్త్వజ్ఞానం నా అనుగ్రహం వల్ల నీకు కలుగుతుంది. సృష్టికి ముందు నేనొక్కణ్ణే ఉండేవాణ్ణి. అప్పుడు నాకు ఎలాంటి కర్మ సంబంధమూ ఉండేది కాదు. స్థూలరూపమూ, సూక్ష్మరూపమూ, వాటికి కారణమైన ప్రకృతీ అప్పుడు నాలోనే ఉండేవి. కుమారా! సృష్టికాలంలో జనించిన జగత్తంతా నా స్వరూపమే అని గ్రహించు.

నా మాయా ప్రభావం వల్ల లేని వస్తువు కనిపిస్తుంది. ఉన్న వస్తువు

Scanned by CamScanner

కనిపించదు. చంద్రుడొక్కడే ఐనా ఇద్దరు చంద్రులున్నట్లు కనిపిస్తుంది కదా! ఇది లేనివస్తువు కనిపించటానికి దృష్టాంతం. గ్రహమండలంలో రాహు గ్రహమనే గ్రహం ఉన్నా అది మనకు కనిపించదు కదా ! ఇది ఉన్న వస్తువు కనిపించకపోవడానికి ఉదాహరణ. పృథివిమొదలైన మహాభూతాలు ఘటం, పటం వంటి భౌతిక పదార్థాల్లో ప్రవేశించి ఉంటాయి. ఈ విధంగానే నేను కూడా భూతనిర్మితాలైన సమస్త భౌతిక పదార్థాల్లోనూ సత్త్వాది రూపాలలో ఉంటాను. పృథివి మొదలైన భూతాలలో ఘటపటాదులైన భౌతిక పదార్థాలు కారణావస్థను పొందుతాయి. అలాగే భూతాలూ, భౌతికాలూ ఇవన్నీ నాలో కారణావస్థను పొంది ఉంటాయి. అంతేకాని అభివ్యక్తాలై ఉండవు. ఇంతవరకు నిరూపితమైన ఈ పరబ్రహ్మ స్వరూపం అన్ని దేశాలలోనూ, అన్ని కాలాలలోనూ ఇలాగే ఉంటుంది. కాని మార్పు చెందదు. తత్త్వం తెలుసుకోగోరే మీబోటి వాళ్ళకు నేనిప్పుడు చెప్పినదే తత్త్వ స్వరూపమైన అర్థమని గ్రహించు. ఈ అర్థమే అన్నిటికంటే శ్రేష్ఠమైంది. దీన్ని ఏకాగ్రమైన మనస్సుతో విని నీ హృదయంలో నిలుపుకో. అలా చేస్తే జగన్నిర్మాణాది కార్యాలు చేసేటప్పుడు మోహం నిన్నంటదు. ఈ విధంగా భగవంతుడైన పరమేశ్వరుడు బ్రహ్మకు ఆనతిచ్చాడు. అనంతరం తన వైకుంఠ లోకంతోబాటు అంతర్ధానం చెందాడు.

(సశేషం)

ఆశ్రమ కంటి ఆసుపత్రి నిమిత్తం ఈ క్రిందివారు త్రినేత్ర వైద్యాలయట్రస్టు నిధికి పైకం పంపినారు

(1).	వి.ఎం.బి. ప్రసాద్, అనూరాధాదేవి గార్లు (ఎస్.వి.ఎన్.నగర్ గుంటూరు) -	రూ.50,116/
(2).	భావరాజు శ్రీనివాసరావు (బెంగుళూరు) -	రూ.10001/-
(3).	ఐ.కేశవరావు (శ్రీశాంతి ఆశ్రమం, తోటపల్లి) -	రూ.10000/-
(4).	సీతారాం ప్రసాద్ (హైద్రాబాద్) -	రూ.40,000/-
(5).	ఆర్.లక్ష్మీనారాయణ (బెంగుళూరు) -	రూ.25000/-
(6).	కోట్ల మీనాలక్ష్మి (పెనుగొండ, ప.గో.జిల్లా)-	రూ.20630/-

శృంగార రాయుని బ్రహ్మోత్సవ హేల

- రచన : డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్

కం ॥ విశ్వాత్ముడు విశ్వేశుడు
విశ్వమయుండఖిలనేత విష్ణుండజుడీ
విశ్వములోఁదానుండును
విశ్వము దనలోనఁ జాల వెలుగుచునుండున్

ఆది మధ్యాంతములు లేనివాడు విష్ణుదేవుడు. ఈ ప్రపంచమే తాను. ఈ ప్రపంచానికి అధిపతి. విశ్వమంతా వ్యాపించిన దైవం ఆయన. ఇందున్నాడు, అందులేడనే సందేహం లేదు. ఎక్కడ చూస్తే అక్కడుంటాడు. విశ్వంలో తాను, తనలో విశ్వాలు కల్గిన మహామహిమాన్వితుడు స్వామి. ప్రకృతి వికాసానికి, ప్రాణికోటి ప్రచలనానికి, విశ్వవృద్ధికి, సమృద్ధికి నీ స్వామియే ఆధారం, ఆలంబన. బ్రహ్మయై సృష్టిరచన, విష్ణువై విశ్వస్థితి పాలన, రుద్రుడై లయకార్యములను నెరవేర్చేది స్వామియే. కనుకనే పరమాత్మయైన విష్ణుదేవుని అక్షరపరబ్రహ్మ అంటున్నారు విజ్ఞులు. అవ్యయుడు, అచ్యుతుడు, సనాతనుడైన స్వామి అనేక అవతారాలలో, విభిన్న ఆకృతులతో దర్శనమిస్తాడు. ప్రతి అవతారానికి ఒక ప్రయోజనం, ఒక లక్ష్యం ఉండడం గమనిస్తాం. శిష్ట రక్షణ, దుష్టశిక్షణ, ధర్మ సంస్థాపనలు సాధారణంగా స్వామి నిర్వహించే పావన కర్మలు. ఇవికాకుండా భక్తపాలనకు, భక్తుల ప్రేమకు, పరమహంసల సుజ్ఞాన సుధారసానికి, అర్చనలకు, ఆరాధనలకు స్వామి ఈ లోకానికి వస్తున్నాడు. భక్తుల ప్రేమ, భాగవతుల పావన క్రతువులు స్వామికి బలాన్నిస్తే, స్వామి ప్రపంచ హితానికి తగిన ప్రతిఫలాన్ని అనుగ్రహిస్తుంటాడు. జీవాత్మల గమ్యం పరమాత్మ పరమపదం. పరమాత్మ వ్యాపారం జీవకోటి రోణ, సంరక్షణ. పరమాత్మకు ఆహారం భక్తి, భాగవతతత్త్వం. జీవాత్మకు ఆశ, ఆశ్వాసనం, ధ్యాస, ధ్యానం, గతి, శరణాగతి పరమాత్మ. ఇదొక అద్వైతయోగం. బ్రహ్మానంద భోగం. ముక్తి సామ్రాజ్యపుద్వార కవాటాలను తెరచే పరమభక్తి యోగం. అదే

Scanned by CamScanner

అనన్య భక్తితత్త్వ అనుభవం. శ్రీకైవల్య సాధనకు అనగా జనన మరణ చక్రభ్రమణపు గాలులు కూడా తగలని, పునర్జన్మరహితమైన పరమాత్మ పరమపదాన్ని చేరుకోవడం.

పూర్వం ఖట్వాంగుడనే ప్రభువు తనకు ఆయువు రెండు ఘడియలలో తీరనున్నదని తెలిసి, గోవింద నామ సంకీర్తనను సమయోగంతో, స్థిరంగా కావించి కైవల్యాన్ని పొందాడు. అలాగే ఏడు రోజులలో శాపవశాత్తు పాముకాటుచే మృతినొందడం ఖాయమని తెలిసిన పరీక్షిత్తు శ్రీ శుకుల వారి ద్వారా భాగవత కథా శ్రవణం చేస్తూ, వాసు దేవుని దివ్య పాదార విందములపై చిత్తమును నిల్పి అనాయాసంగా పరమ పదాన్ని పొందాడు. అలాగే త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య వంటి వాగ్గేయకారులు శ్రీహరిగాన సంకీర్తనతోనే ముక్తిని పొందారు. అణువుకన్నా అణువు, అనూహ్యమైన రూపంగల స్వామిని భక్తితో కీర్తించి, ధ్యానించి, గానంచేసి, ముక్తిని పొందాలని జీవులు తపిస్తుంటారు.

శ్రీహరిపైగల భక్తి యోగమే ముక్తియోగం. హరిభక్తుల జోలికి యముడు కూడ రావడానికి భీతిల్లుతాడు. హరిభక్తి సాగిపోయే నావ. దాన్ని, భక్తి యోగంతోనే అందుకోవాలి. నామస్మరణా బలమే ఫలమై హరిపదాన్ని చేర్చుతుంది.

కలియుగంలో కలి కల్మషాలనుండి, వాని బాధల నుండి భూలోక వాసులను కాపాడడానికి శ్రీహరి తిరుమల గిరిపై శ్రీ వేంకటేశ్వరుడై కొలువు దీరినాడు. అక్షర పరబ్రహ్మయైన అచ్యుతునకు నవబ్రహ్మలు నవాహ్నికదీక్షతో నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ధ్వజారోహణంతో ప్రారంభమై ధ్వజావరోహణంతో ముగిస్తారు. ఈ తొమ్మిది రోజులు అలంకార ప్రియుడై వేంకటవిభుడు విభిన్న రూపాలలో, విశిష్ట వాహన సేవలను అందుకొంటూ తిరువీధులలో మెరసి ఊరేగుతాడు. ఉభయ దేవేరులయిన శ్రీదేవి భూదేవీ మాతల శృంగారపు చూపుల సౌందర్యలహరిలో మునకలు వేస్తూ సింగారాలు ఒలక బోస్తాడు. నిజానికి భక్తులందరూ స్వామికి నాయికలే. భగవానుడు నాయకుడు. జీవాత్మలతో ఆట, పాట, వేట పరమాత్మయైన శ్రీనివాసునకు

ఆనందం. భక్త తతికదే బ్రహ్మానందానుభూతి. అన్నమయ్య "హరి యవతారాలే అఖిల దేవతలు, హరిలోనివే అఖిల బ్రహ్మాండములు, హరినామములే అన్ని మంత్రములు, హరి హరి హరి హరి యనవే మనసా!" అంటూ " మనసా! హరినామస్మరణ చేయి. జన్మతరిస్తుంది."అని సెలవిచ్చారు. ఈ సందర్భంగా సదాశివ బ్రహ్మేంద్రయోగులవారి గీర్వాణ కీర్తనలు గుర్తు చేసుకోవాలి.

మానస సంచర రే బ్రహ్మణి మానస సంచర రే
మదశిఖిపింఛాలంకృత చికురే
మహనీయ కపోల జితముకురే ॥ మానస॥

అంటూ "ఓ మనసా! శ్రీకృష్ణ పరమాత్మే అక్షర పరబ్రహ్మ. ఆ పరబ్రహ్మమునందే నీవు సంచరించు. నెమలిపింఛం ధరించి, అందమైన చెక్కిటద్దాలు గల స్వామియందే చరించు॥ అని తనకు తానే హితవు చెప్పుకొన్నాడు. సంకల్ప వికల్పాలకు స్థానం మనస్సు. అలాంటి మనస్సును బుద్ధితో కట్టివేసి, పరమాత్మను మదిలో నిల్పుకోవాలి" అని వారి సూచన.

ఉత్సవాలు, కల్యాణాలు, అభిషేకాలు, అర్చనలు, క్రతువులు మొదలయినవి పరమాత్మకు ఎందుకు చేస్తారు. కేవలం ఆనందం, ఆర్భాటానికే కాదు. లోకహితం, జీవహితం కొరకు. అలాగే ఒక ఆధ్యాత్మిక స్ఫూర్తి, అనుభూతి కొరకు. సదాచారం, సదాచార మూలమైన ధర్మ ప్రబోధం కొరకు. స్వామికి సేవలందిస్తున్న వాహనాలు ఒక్కొక్కటి ఒక్కో రకమైన ప్రత్యేకత' ప్రాభవం కల్గి యున్నాయి. తల్లి దాస్యశృంఖలాలను వదిలించిన గరుడుడు, సీతమ్మ జాడకై శతయోజన పర్యంతమైన లవణసాగరాన్ని దాటి, అమ్మను కనుగొని, ఓదార్పు ఊరటలను కల్గించి, తిరిగి రామయ్య దగ్గరకు వచ్చి, రావణ సంహారానికి సహకరించిన హనుమంతుడు, పరమాత్మకు ప్రధానమైన ప్రథమమైన భక్తులు. వారి భక్తిరస స్ఫూర్తిని మనం పొందాలి.

ఇలా బ్రహ్మోత్సవాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమం అర్థవంతం, పరమార్థ సాధకమై యుంటుంది. అందుకే కవులు వేంకటాద్రికి

అచల మిదియ ముక్తి సతిచేతి యలరు బంతి

Scanned by CamScanner

పావకధుళుల నిలంగూల్చు భద్రదంతి
యీప్సితార్థ రసమ్ముల నీను సురఖి
సంయమీంద్ర కులావనీ జాత సురభి" అన్నారు

మోక్షాన్నిచ్చి, పాపులను, పాపాలను నశింపజేసి, కామితార్థాలను అందించే కామధేనువు వేంకటాద్రి. అలాంటి వేంకట విభుని బ్రహ్మోత్సవ సందడిని దర్శించి తరించాల్సిందే. అమరులకాధారమై, ఆళ్వారులకు ప్రత్యక్షమై ప్రకాశించే బ్రహ్మాండమైన తిరుమలకొండ దేవుని బ్రహ్మోత్సవాలు అనుభవైక వేద్యాలే కాని బోధ్యాలు కావు; కనీసం ఈ పావన దినాలలో నారాయణుని దివ్య నామకీర్తనలు, మురవైరి పావన కథాశ్రవణం మాధవునికి మనసు అర్పించి విందాం. చక్రాయుధుడైన స్వామికి అంజలి ఘటించి శరణు కోరదాం

గీ॥ చేతులారంగ శివునిఁ బూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబులోనుగా దలపడేని
గలుగ నేటికిఁ దల్లుల కడుపుచేటు .

సద్గురు సర్వసేవా ట్రస్టుకు క్రిందివారు పైకం పంపినారు

(1). ఎన్.నారాయణరెడ్డి, శ్యామలమ్మ గార్లు (నెల్లూరు)
దు.జయమ్మ పేరిట భిక్షానిధి - రూ.20,000/-

(2). ఎన్.నారాయణరెడ్డి, శ్యామలమ్మ గార్లు (నెల్లూరు)
దు.జయరాంరెడ్డి పేరిట భిక్షానిధి - రూ.20,000/-

(3). తిరుక్కాల వెంకటముని భార్య కాన్తాదేవి
(శ్రీకాళహస్తి) టి.ఎల్లమ్మ పేర భిక్షానిధి - రూ.15000/-

(4). కె. చంద్రభూషణమ్మ (కొత్తపేట, శ్రీకాళహస్తి)
టి.దొరస్వామి నాయుడు పేర భిక్షానిధి - రూ.10116/-

(5). కె. సరస్వతమ్మ (మోతీనగర్, హైద్రాబాద్)- రూ.10000/-

పరివ్రాజక పరమార్థము

(ధర్మపద బోధలకనువాదము) - నైనారు అప్పాస్వామి (తిరుపతి)

1. చిత్తమందలి తప్పుల చిత్తుజేసి
సత్యదమములు గల్గుచు సంచిరించు.
మంచి యాచార పరుడగు మానవునికి
కావి బట్ట గట్టెడు ఘనత కలుగు.

2. ద్వేషరాగములు మదిని తేలుచుండ
కావిబట్టిలు గట్టిన కపటయోగి
సత్యదమములు లేక నశాన్తినొందు
సన్న్యసించెడి యర్హత శూన్యమగును

3. నిత్యమప్రమాదానంద నిలయుడగుచు
భయము గలుగక ప్రమాదము పాలుబడక
సంచరించెడి సన్న్యాసి సమయజేయు
నగ్నివలె బంధములనెల్ల నశ్రమముగ

4. భోగముల వీడి పరిపూర్ణత్యాగమలర
నిత్యమేకాకిగా నుండ నిచ్ఛగించు
చిత్తమందలి కోర్కెలు చితిని జేర్చి
శుద్ధుడైమనగ కలుగు శుభములెల్ల.

5. బూదిపూత, జడలు, దిగంబరత
నేలనిద్ర తీవ్రవాంఛలు ధూళినిండుమేను
కలిగి తిరిగిన సన్న్యాసిగాడు నరుడు
విషయవాంఛల జంపిన విమలుడగును.

6. విషయ భోగములను వీడి విషములనుచు
ముక్తినొసగెడి వైరాగ్య ముగ్ధపథము.
నరయువారు జేరెదరు లోనభిలషించి
జనులు దిరుగని సుందర సానువులను

(1994 జూలై సద్గురు వాణి నుండి)

వార్తలు

(01). ఆగష్టు 28వ తేది (28-08-2019) బుధవారం శ్రావణ మాస మాసశివరాత్రి సందర్భంగా శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ప్రదోషకాలంలో ఆశ్రమ శివాలయ శ్రీ నర్మదేశ్వర శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేయబడింది. భక్తులకు ప్రసాదవినియోగం చేశారు.

(02). శ్రీకాళహస్తి నుండి అక్కుర్తి ఆనందరెడ్డి గారు నడుపుతున్న ఆధ్యాత్మిక అవధూత మానవత్రిక 4వ వార్షికోత్సవంలో శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని తమ ఆశీస్సులనందించారు. ఈ కార్యక్రమం శ్రీ సాధుస్వయంభూలింగస్వామి ఆశ్రమంలో జరిగినది. దీనిలో స్థానిక శాసనసభ్యులు శ్రీ మధుసూదనరెడ్డిగారు, తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత శ్రీ డా॥సిపాయి సుబ్రహ్మణ్యంగారు, అంజూరు శ్రీనివాసులు గారు మొదలగువారు పాల్గొన్నారు.

(03). సెప్టెంబరు 2వ తేది సోమవారం (2-09-2019 వినాయకచవితి సందర్భంగా ఆశ్రమంలో విఘ్న వినాశకుడు వినాయకునికి అభిషేక అర్చనాదులు, పత్రిపూజ చేసి కుడుముల నైవేద్యం చేశారు. విజయవాడ, తాడేపల్లి గూడెం వగైరా పట్టణాలనుండి వచ్చిన మాతాజీలు అనేక రకాల వుండ్రాళ్లు, పిండివంటల, నైవేద్యం పెట్టి విశేషంగా భజనలు చేశారు.

(04). సెప్టెంబరు 13వ తేది భాద్రపదపౌర్ణమి శుక్రవారం నాడు ఆశ్రమ అధిష్ఠాన మందిరంలో గురుపాదుకలకు అభిషేకం అర్చనాదులు జరిగాయి. ప్రసాద వినియోగం చేయబడింది. సెప్టెంబరు 20వ తేది కృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శ్రీకార్తికేయస్వామికి ప్రదోషకాలంలో పంచామృత అభిషేకం అర్చనాదులు చేయబడినవి. సెప్టెంబరు 27వ తేది శుక్రవారం నాడు మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమంలోని నర్మదేశ్వర మహాదేవునకు ప్రదోషకాలంలో రుద్రాభిషేకం, బిల్వార్చన చేయబడింది.

(05). ఆగష్టు 6వ తేది మంగళవారం **పెంకలపాడు** గ్రామంలో ఆగష్టు **13**వ తేది మంగళవారం **కమ్మకొత్తూరు** గ్రామంలో, ఆగష్టు 27వ తేది **కొణతనేరి** గ్రామంలో ఆశ్రమ కంటిఆస్పత్రిచే కంటి వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.

(06). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఆగష్టు నెలలో ఓ.పి. విభాగంలో **1321** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. **125** మందికి కళ్ళలో పొరలు తీసివేసి లెన్సు అమర్చినారు. **11** మందికి యాగ్‌లేజర్ చికిత్స చేశారు.

Scanned by CamScanner

Regd.No. TRP / 123 / 2018 - 20 October 2019 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-09-2019, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము

భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

Scanned by CamScanner